
AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 6, Issue: 36 October - 2009

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



## ప్రజల నాడి తెలిసిన వైద్యుడు

## దివ్య కాంతులు భువిని తాకిన వేళ

## రండి, ఆత్మ పరిశీలన చేసుకుందాం

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఉచితం

أولم يرالذين كفروأأن السموات والأرض كانتا رتقا ففتقناهما
وجعلنا من الماء كل شيء حي أفلا يؤمنون

"ఆకాశాలు - భూమి పరస్పరం కలిసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరు చేశామనీ, ప్రాణమున్న ప్రతి దానినీ మేము నీళ్ళతో సృష్టించామన్న విషయాన్ని అవిశ్వాసులు గమనించటం లేదా? అయినప్పటికీ వారు విశ్వసించరా??"

(దివ్య ఖుర్ఆన్ - 21:30)



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక


# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 6, ISSUE: 36
OCTOBER 2009



CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN
Noushad Zainulabdeen

www.zukhruf.net
Tel. 99993072



PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait




PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT


# దీపం క్రింద చీకటి

## ఈ సంచికలో....


ఆశాజ్యోతి ఆరిపోయింది. ..... 2
ఎవరు ఆదరణీయులు? ..... 3
దీపం క్రింద చీకటి ..... 4
ప్రజల నాడి తెలిసిన డాక్టర్ ..... 6
తహజ్జుద్ వరాలు ..... 8
దివ్య కాంతులు... ..... 10
ఇమామత్ ఆదేశాలు ..... 12
హృదయాల విజేత... ..... 13
బలవంతం ఏమీ లేదు ..... 14
జె.పి. సత్తా ..... 15
ఐ.పి.సి వార్తలు ..... 16
ఆత్మావలోకనం ..... 18
సైన్స్ ఫ్లా ..... 19
ఉత్తరాలు ..... 20



❖ يا أيها الإنسان إنك كادح إلي ربك كدحا فملاقيه ❖ من الأسوة؟ ❖ ظلام تحت المصباح
❖ مقالة عن رئيس ولاية آندهرا برديش ❖ بركات صلاة التهجد ❖ نزول الوحي
❖ أحكام السترة ❖ فاتح القلوب (نشيد) ❖ الهمة طريق القمة
❖ لا إكراه في الدين ❖ أخبار اللجنة ❖ محاسبة النفس ❖ أنفلونزا الخنازير ❖ رسائل الهلال

దృక్పథం



# ఆశాజ్యోతి ఆరిపోయింది

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మరణ వార్తను తెలుగు జాతి జీర్ణించుకోలేకపోయింది. ఈ వార్త విన్న వంద మందికి పైగా జనులు గుండె ఆగి మరణించారంటే, దజన్ల సంఖ్యలో వీరాభిమానులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే ఆంధ్రావనిపై రాజశేఖరుడి ముద్ర ఎంత బలంగా ఉందో ఊహించవచ్చు. ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పటి నుంచీ రాష్ట్రంలో ఒక మెరుగైన ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి గారు సంపాదించినంతటి ప్రజాదరణను వేరెవరూ సంపాదించలేదన్నది పదహారణాలా నిజం.

ఒకవైపు చంద్రబాబు సారథ్యంలోని బలమైన మహా కూటమి, మరో వైపు కె.సి.ఆర్ నాయకత్వంలోని తెలంగాణా వేర్పాటు వాదం ఉండగా వాటి ధాటికి తట్టుకుని రెండవసారి కాంగ్రెస్ రాష్ట్రంలో గెలిచిందంటే, అది ముమ్మాటికీ రెడ్డిగారి ప్రజోపయోగకార్యాల ఘనతే. మరో ఐదేళ్ళు తిరుగులేని ముఖ్యమంత్రిగా ఉంటారని అందరూ ఘంటాపథంగా చెప్పారు. కాని పట్టుమని ఐదు మాసాలైనా నిండక ముందే ఆయన ముఖ్యమంత్రిగా 'పదవీ విరమణ' చేశారు. తిరుగులేని తన రాజకీయ జైత్రయాత్రకు చరమ గీతం పాడుతూ, ఎన్నడూ తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయారు.

అంతా అయిపోయాక ఆయన మరణంపై "అయితే.....గితే" లాంటి సందేహాలు ఎన్నో ఉత్పన్నమవుతున్నాయి. కాని మరణం ఒక కఠోర సత్యం. ఎంతటివారైనా దాన్ని జయించలేరు. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ దాని ఒడిలోకి జారుకోవలసి ఉంటుందో దాని ప్రకారమే కాగల కార్యాన్ని మృత్యు దూత అమలు పరుస్తాడు. చరిత్ర చెప్పే చేదు నిజం ఇదే.

ఈ విషాద సందర్భంగా దైవప్రవక్త సులైమాన్ (అలైహిస్సలాం) కాలం నాటి గాథ జ్ఞప్తికి వస్తోంది. చక్రవర్తి కూడా అయిన సులైమాన్ (అ)కు దేవుడు ఎన్నో అసాధారణ శక్తుల్ని ఇచ్చాడు. గాలులు ఆయనకు వశపరచబడ్డాయి. సింహాసనంపై కూర్చొని ఏ దిశలోనైనా ఆయన రాకెట్ వేగంతో పయనించేవారు. ఆఖరికి మృత్యు దూత కూడా ఆయన కొలువుకు విచ్చేసి ఆయనతో ముచ్చటిస్తూ ఉండేవాడు. ఒకసారి సులైమాను చక్రవర్తి తన దర్బారులో ఒక వ్యక్తితో సమాలోచన జరుపుతుండగా, మృత్యుదూత మానవాకారంలో హాజరై, ఆ వ్యక్తిని అదే పనిగా చూడసాగాడు. ఆ అపరిచితుని వింత చూపులకు ఆ వ్యక్తి సహజంగానే ఆశ్చర్య చకితుడయ్యాడు. మరణ దూత నిష్క్రమించిన మీదట, 'అతనెవరు? నన్నెందుకు అలా చూస్తున్నాడు?' అని ఆ వ్యక్తి రాజు గారిని అడిగాడు. "అతను మరణ దూత. అప్పుడప్పుడూ నా వద్దకు వస్తూ ఉంటాడు" అని చెప్పారు రాజుగారు. అంతే. ఆ వ్యక్తికి చెమటలు పట్టాయి. అతని మనసు కీడు శంకించింది. ఆ మాటే రాజుగారితో చెప్పి, తనను ఏదైనా దూర దేశంలోని మారు మూల ప్రాంతానికి పంపమని, ఆ విధంగానైనా మృత్యు బారి నుండి సురక్షితంగా ఉంటానని విన్నవించుకున్నాడు. అతని అభ్యర్థనపై రాజుగారు "ఈ వ్యక్తిని భరత ఖండంలోని ఒక మారుమూల అడవిలో విసిరేయి" అని 'వాయువు'ను ఆజ్ఞాపించారు. ఆ విధంగా క్షణాల్లో ఆ వ్యక్తి సిరియా రాజ్యం నుండి భరత ఖండంలోని అడవులకు బదిలీ అయిపోయాడు.

మరునాడు తన దర్బారుకి వచ్చిన మృత్యు దూతను ఉద్దేశించి, "ఇంతకీ నిన్న ఆ వ్యక్తిని ఎందుకలా ఉరిమి ఉరిమి చూశావ్?" అని సులైమాన్ గారు అడిగేసరికి అసలు కథను మృత్యు దూత తాపీగా ఇలా వివరించాడు: "దైవాజ్ఞ ప్రకారం నేను అతని ప్రాణం భారత భూభాగంలోనే తీయాలి. కాని ఒక్కరోజు ముందు అతను సిరియాలో – మీ దర్బారులో – ఉన్నాడు. సిరియా దేశంలో ఉన్న అతని ప్రాణాన్ని భారత భూభాగంలో ఎలా తీయగలనా అని ఆశ్చర్యమేసి అతన్ని తదేకంగా చూడసాగాను. అయితే నిర్ధారిత సమయం ప్రకారం అతని ప్రాణాన్ని ఈ రోజే భరత ఖండంలోనే వశపర్చుకున్నాను".

అవును. మృత్యువు మనిషిని నిర్ధారిత సమయానికి, నిర్ధారిత స్థలంలోనే కబళిస్తుంది. 'అకాల మరణం' అని మనమంటాం. అది అకాలం కానే కాదు. అది ఎప్పుడూ సకాలంలోనే వస్తుంది. కాకపోతే అది మన మనోమస్తిష్కాలకు అందనిది. **"రేపు తానేం సంపాదించేదీ ఏ ప్రాణీ ఎరుగదు. తనకు ఏ భూభాగంలో మరణం వస్తుందో కూడా ఎవరికీ తెలీదు".** (దివ్య ఖుర్ఆన్–31:34)

మన ముఖ్యమంత్రి విషయంలో జరిగింది కూడా ఇదే. మనసున్న ఆ ప్రజల మనిషి ఎన్నో కలలు గన్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో జీవించారు. ఆశల ఆరాటంతోనే చిత్తూరు పయనమయ్యారు. కాని ఆయన గమ్యస్థానం చిత్తూరు కాదని, ఆశలకు – అభిలాషలకు అతీతమైన ఊర్ధ్వలోకాల మహాప్రస్థానంలో నల్లమల కీకారణ్యంలోని పావురాల గుట్ట ఓ చిరు మజిలీ మాత్రమేనని ఎవరికి తెలుసు!? అన్ని ఒనరులూ ఉన్న ఒక ప్రభుత్వ వ్యవస్థకే ముఖ్యమంత్రి ఆచూకీ తెలుసుకోవటానికి 23 గంటల సమయం పట్టిందంటే ఈ మానవమాత్రుని శక్తి ఏ పాటిదో అర్థమవుతూనే ఉంది. ఏది ఏమైనా డా.రాజశేఖర్ రెడ్డి మరణం రాష్ట్రానికి తీరని లోటు. ఆ లోటును పూడ్చగలిగే ప్రత్యామ్నాయాన్ని ప్రసాదించమని పరమోన్నత ప్రభువును కడు దీనంగా ప్రార్థించటం వినా మార్గాంతరం లేదు.



# ఎవరు ఆదరణీయులు ?

ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com



ప్రపంచంలో మానవుల మధ్య ఎప్పుడు, ఎక్కడ కలతలు, కలహాలు చెలరేగినా, వైమనస్యాలు, వైషమ్యాలు పెరిగినా దానికి కారణం సదా ఒక్కటే - దుర్మార్గం, దురభిమానం, దురహంకారం, భాషావైషమ్యం, దేశం, ప్రాంతం, వంశం, వర్ణాల దురభిమానం, సంకుచిత జాత్యహంకారం.

"నా భాష అత్యంత ప్రాచీనమయిన ద్రావిడభాష, అందువల్ల అన్నింటికంటే గొప్పది. నా సంస్కృతి అంతకంటే పురాతన మయింది. అందువల్ల అన్నీ దానికి దాసోహమనవలసిందే. మా జాతి ప్రపంచంలో అత్యంత గొప్ప నాగరికతకు చిహ్నం, మేము మహా గొప్ప ఫిరౌనుల సంతానం. మేము ప్రపంచంలోనే గొప్ప నాగరిక జాతి అయిన ఆర్య జాతికి చెందిన వారం. అందువల్ల యూదుల్ని అల్పులయిన అనార్యుల్నీ చీల్చి చెండాడుతాము. మేము 'ఆర్యా మెహర్' అన్న బిరుదును సగర్వంగా వాడుకుంటాము. మాది సూర్య వంశం, గొప్ప చక్రవర్తుల వంశం. మాది చంద్ర వంశం మహాగొప్ప రారాజుల వంశం. మేము తెల్లజాతివారము. మేము విజ్ఞాన సంపన్నులము. ప్రపంచాన్ని ఏలే అర్హత, అధికారం మాకు మాత్రమే ఉన్నాయి".

ఇలాంటి నినాదాలు, ఉద్ఘోషణలు - మూలకారణమయిన ఆ దురభిమానం, దురహంకారంలో నుండి ఉద్భవించినవే. ఇవన్నీ అసత్యపు నినాదాలు, అబద్ధపు ప్రలాపనలు. వాస్తవం మాత్రం ఇదే! మానవులంతా ఎన్ని శాఖోపశాఖలుగా విస్తరించినా ఒకే స్త్రీ పురుషుల జంట ద్వారా ఉనికిలోకి వచ్చినవారే.

ఒకే మూలం నుండి విస్తరించినా మానవాళి ప్రకృతి సిద్ధంగా అనేక రంగుల్లో, తెగల్లో, జాతుల్లో విడిపోయింది. ఈ సహజ పరిణామాలు మనుషుల్లో నిమ్నోన్నతాభావనలకు, హెచ్చుతగ్గులకు, భేదభావాలకు, శ్రేష్ఠులూ, నీచులూ అనడానికి ప్రమాణాలు కారాదు. మీలో వంశం, వర్ణం, వర్గం ఇత్యాది వ్యత్యాసాలు కేవలం మీరు పరస్పరం ఒకరినొకరు పరిచయం చేసుకోడానికి, ఒకరినొకరు గుర్తించడానికేగాని గర్వపడడానికి, ఒకరిని నీచులుగా, మరొకరిని ఉన్నతులుగా భావించడానికి కాదు.

నిజానికి మానవుల మధ్య వ్యత్యాసం చూపగల ప్రమాణం, మానవుల్లో ఎవరు ఉన్నతుడు ఎవరు నీచుడు అని తెలుసుకోడానికి గీటురాయి ఏదయినావుంటే అది కేవలం నైతికమయింది మాత్రమే.

నైతికంగా ఉన్నతుడయినవాడే మానవుల్లో ఉత్తముడు. అతడు నల్లవాడయినా, తెల్లవాడయినా, అనార్యుడయినా, అరబీ మాట్లాడేవాడయినా, ఇంగ్లీషువాడయినా సరే.

మానవులారా, మేము మిమ్మల్ని ఒక స్త్రీపురుషుల జంట ద్వారా పుట్టించాము. తరువాత మిమ్మల్ని జాతులుగా వంశాలుగా చేశాము, తద్వారా మీరు ఒకరినొకరు గుర్తుపట్టగలగాలని. వాస్తవానికి దైవం దృష్టిలోనయితే, మీలో అందరికన్నా అధికంగా చెడులకు దూరంగా ఉండేవాడే ఆదరణీయుడు. (49: 13)
అందువల్లనే దేవుని అంతిమ సందేశహరుడు (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు:
జనులారా, తెలుసుకోండి: మీ అందరి దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బేతరులపై గాని, అరబ్బేతరులకు అరబ్బులపైగాని, తెల్లవానికి నల్లవానిపై గాని, నల్లవానికి తెల్లవానిపై గాని ఎలాంటి ప్రాధాన్యత లేదు. అత్యధిక భయభక్తులు గలవాడే దైవం దృష్టిలో గౌరవనీయుడు.



# దీపం క్రింద చీకటి

**తె**ల్ల దొరల పాలనకు అర్థం పీడనగా మార్చి, జాతి సౌభాగ్యాన్ని కొల్లగొడుతున్న ఎర్ర తేళ్ళపై – బతుకు కోసం, భవిత కోసం ఏకోన్ముఖ పోరుకు ఉరకలెత్తిన కోట్లాది భారతీయుల త్యాగాల ఫలితమే నేటి మన స్వతంత్ర భారతం. 'ప్రాగ్దిశాకాశంలో వినూత్న తార' ఉదయించి అరవై మూడేళ్ళు పూర్తయ్యాయి.



– శాంతి ప్రియ

"దారిద్ర్యాన్ని, దాని కవలలైన ఆకలి అనారోగ్యాల్ని నిర్మూలించి, సామాజిక అంతరాలు పూడ్చి, దోపిడీలను అరికట్టి గౌరవప్రదమైన జీవన పరిస్థితుల పరికల్పనకు పరిశ్రమిస్తాము" అన్న వాగ్దానం ఏ మేరకు వాస్తవ రూపం దాల్చిందన్న విషయం పరిశీలిస్తే ఆనందంతోపాటు ఆందోళన కూడా కలుగుతుంది.

దేశమంటే అధికారమనీ, భాగ్యవంతులనీ, మెజారిటీలనీ భావించేవాళ్ళు గాంధీలనీ, ఆజాదులనీ, భగత్ సింగుల్నీ, రవీంద్రుల్నీ, నెహ్రూల్నీ, అంబేద్కర్లనీ గత చరిత్ర పుటల్లో దాచేసి కడుపే కైలాసమని తలపోస్తూ, తమ జాతి గుండెల్లోనే గునపాలు దింపుతూ, నిజాయితికి బేరం పెట్టి పచ్చ కాగితాలకు నిస్సంకోచంగా అమ్ముకునే నాయకులే నేడు మన భారతాన్ని ఏలుతున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజల్ని కొల్లగొడుతూ మానవతా వాదులం అన్న మాస్కులు తొడిగి మారణ హోమాలు సృష్టిస్తున్నారు.

గూండాగిరీ, దౌర్జన్యాల పట్టా, అత్యాచారాల, అన్యాయాల చిట్టా, హత్యల దమనకాండల డిగ్రీ– ఇవే నేడు మన నాయకుల క్వాలిఫికేషన్లుగా చెలామణి అవుతున్నాయి.

ఇక దేశ ప్రజల పరిస్థితి అంటారా– "పేదల పూరి గుడిసెల మధ్య నుండే మన ఉపగ్రహాలు నింగికి ఎగుస్తున్నాయి" అన్న తొలి దళిత రాష్ట్రపతి నారాయణ్ మాటకు అద్దం పడుతోంది నేటి స్థితి. బ్యాగులు భుజానికెత్తుకుని బడికెళ్ళి చదువుకు(కొ)నే బాలల్ని చూస్తుంటే – ముచ్చటేస్తుంది. కానీ బ్రతుకే భారమై బడికెళ్ళలేక బొగ్గు గనుల్లో, టీ అంగళ్ళలో, ఫ్యాక్టరీలలో, ఫుట్‌పాత్‌ల మీద పుళ్ళు పడ్డ చేతుల్తో, కన్నీళ్ళింకిన కళ్ళతో, భయోద్విగ్నంగా, అర్ధ నగ్నంగా మొగ్గలోనే వాడిపోతున్న అభాగ్య జీవులు సైతం చదువుకునే రోజులు రావాలని దేశాభిమానులందరూ ఎదురు చూస్తున్నారు.

ఈ అభాగ్యుల బాల్యం అమ్మ కమ్మనైన ఒడిలో పెరగాల్సింది పోయి వీధి పాలయ్యింది. ఎదగని మనస్తత్వాల వింత శాడిజానికి బలి పశువై పోయింది. రాత్రంతా బార్లల్లో తిట్లూ, పిడిగుద్దులు తింటూ, బరువైన గుండెలు చెరువవుతున్నా భరిస్తూ, ఫుట్‌పాత్‌ల మీద కునుకు తీస్తున్న నిశి రాత్రిలో అకస్మాత్తుగా ఖాకీ లాఠీల తాండవానికి కకావికలై వీపులపై పడ్డ వాతల్ని బిగబెట్టిన పెదవులతో సహిస్తూ ఎటు వెళ్ళాలో పాలుపోక, ఏం చేయాలో తోచక అగమ్యగోచరమవుతున్న వారి జీవితాలకు అభయ హస్తం అందించి ఆదుకునే రోజులు ఎప్పుడు వస్తాయా? అని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు ఆ బాల కార్మికులు.

అభాగ్యులైన ఈ భావి భారత పౌరులకు – ఖరీదైన చాక్లెట్లు ఎలా ఉంటాయో తెలీదుగానీ, ఆ చాక్లెట్ల తాలూకు పేపర్లు ఎక్కడ దొరుకుతాయో మాత్రం తెలుసు. చెత్త కుప్పల్లో చిత్తు కాగితాలు ఏరుకుంటూ చిత్తయిపోయిన చిన్నారులు పాలు కారే పాల బుగ్గలు కావు వారివి. పాలు కారే ఖాళీ ప్యాకెట్లు ఎక్కడ ఉంటాయో మాత్రం తెలుసు. బిర్యానీలు, రుచికరమైన తినుబండారాలు ఎలా ఉంటాయో తెలీదు పాపం వారికి. కానీ, తిని పడేసిన ఎంగిలి ఆకులు ఎక్కడుంటాయో బాగా తెలుసు. సుసంపన్నులు భావి భారత విధాతలంటే – మరి వీరు రేపటి భవితలు కారా? మనం చూడబోయే రేపటి కలకు ముందు హెచ్చరికలు కారా? 'దేశమంటే మనుషులోయ్' అన్నారే గురజాడ వారు, మరి వీరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత మన మీద లేదా?

'మన స్వాతంత్ర్యం మేడిపండు – మన దారిద్ర్యం రాచ పుండు' అన్న ఆరుద్ర మాట నేటి మన యువతరంలో నిజమవుతున్నది. యవ్వనం అనే వనంలో, కామం అనే కారడవుల్లో కొట్టుమిట్టాడుతు, చిత్తుగా త్రాగి మత్తుగా పడుకొంటున్నది. లేకపోతే లేదన్న బాధతో త్రాగుతూ ఉంది. ఉంటే – ఉందన్న ఉత్సాహంతో మరింత త్రాగి మానవత్వాన్ని మరచి మృగాల్లా వ్యవహరిస్తున్నది. వీళ్ళ ఈ వికృత చేష్టల వల్ల వల్లకాడవుతున్నది

భారతం. అడుగడుగునా ఈ 'సోనేకి చిడ్యా' (బంగరు పిచ్చుక) బంజరు భూమిగా మారుతున్నది. స్వరాజ్యాన్ని సంరక్షించే బాధ్యత గల ఈ యువతరం, తమ పొడుగాటి జులఫాలను భుజాలపై వేలాడ దీసుకుని నడుములు వంచి నాట్యాలు చేస్తూ, పబ్బుల్లో, క్లబ్బుల్లో, మబ్బుల్లో తుళ్ళుతూ తూగుతున్నారు. ఎవరి కొంగులపై సైతం పర పురుషుని దృష్టి పడలేదో అట్టి శీలవతులు భారత స్వాతంత్ర్యం కోసం సామూహిక మానభంగానికి గురయి అవమానం భరించలేక ఎలా విలవిల్లాడుతూ ప్రాణాలు వదిలారో, చెట్టాపట్టాలేసుకుని సిగ్గూ, ఎగ్గూ లేకుండా త్రుళ్ళుతూ, తూగుతూ నృత్యాలు చేస్తున్న వనితలకేం తెలుసు?

పాశ్చాత్య దేశాలతో, తెల్ల దొరలతో మనం సైనిక పరంగా ఓడిపోయామంటే ఫరవా లేదు, కాని నైతికంగా వారికి దాసోహ మవటం, పాశ్చాత్య సంస్కృతీ నాగరికతలకు, వారి ఆలోచనా సరళికి, వారి ఫిలాసఫీకి కూడా గులాంగిరీ చేయడం అత్యంత ప్రమాదకర పోకడ. ఇది దేశ ప్రగతికే గొడ్డలి పెట్టు అవ్వచ్చు. తెల్ల దొరలు మన దేశాన్ని వీడి వెళ్ళి చాలా కాలమే అయినా, ఇక్కడి కొందరి మనో మస్తిష్కాల్లో పాశ్చాత్యుల బానిస భావం నిండి ఉంది. వారు గీసిన గీతను దాటి తాము స్వతంత్రంగా జీవించ గలం అనే ఆత్మ స్థయిర్యానికి నోచుకోని భావ దారిద్ర్యం వాళ్ళని ఆవహించి ఉన్నది.

కూలి కడుపులు గుప్పెడు మెతుకుల కోసం, గుక్కెడు తన్నీరు కోసం అలమటించి పోతుంటే- రంగుల కలలోన ముంచి వెండి తెర అశ్లీలం - వీధుల్లో ప్రవహిస్తున్న సినిమాయ జగత్తు సిగ్గూ, మానాల్ని, లజ్జా వ్రీడల్ని నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. టీవీల్లో, నవలల్లో - ఎక్కడ చూసినా సెక్స్, హింస, నేరాలే - కుళ్ళు కుంపటి, కుట్ర కుతంత్ర భావాలే. స్వాభిమానం చచ్చిన, పౌరుషం నశించిన యువతరం, వారికి మార్గదర్శకులుగా వ్యవహరించే వృద్ధ మారాజుల దుష్కర్మల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న చేదు అనైతిక ఫలం. చివరికి 'స్వలింగ సంపర్కం' లాంటి లజ్జావిహీన చేష్టకు సైతం లైసెన్సు లభించింది. దేశ

**ఈ అభాగ్యుల బాల్యం అమ్మ కమ్మనైన ఒడిలో పెరగాల్సింది పోయి వీధి పాలయ్యింది. ఎదగని మనస్తత్వాల వింత శాడిజానికి బలి పశువై పోయింది. రాత్రంతా బార్లల్లో తిట్లు, పిడిగుద్దులు తింటూ, బరువైన గుండెలు చెరువవుతున్నా భరిస్తూ, ఫుట్‌పాత్‌ల మీద కునుకు తీస్తున్న నిశి రాత్రిలో అకస్మాత్తుగా ఖాకీ లాఠీల తాండవానికి కకావికలై వీపులపై పడ్డ వాతల్ని బిగబెట్టిన పెదవులతో సహిస్తూ ఎటు వెళ్ళాలో పాలుపోక, ఏం చేయాలో తోచక అగమ్యగోచరమవుతున్న వారి జీవితాలకు అభయ హస్తం అందించి ఆదుకునే రోజులు ఎప్పుడు వస్తాయా? అని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు ఆ బాల కార్మికులు.**

సామాజిక సాంస్కృతిక జీవనానికి పట్టుకొమ్మలయిన విలువలు, ఆదర్శాలు ఇలా మట్టి పాలవుతుంటే-, నీతి స్థానే అవినీతి, నిజాయితీ స్థానే నిలువు దోపిడీ, నిర్భయం స్థానే పిరికితనం, నిష్పక్షపాతం స్థానే పక్షపాత ధోరణి, సహేతుకత స్థానే అంధానుసరణ చోటు చేసుకుంటే - దాన్ని పురోగమనం అనాలా? లేదా తిరోగమనం అని చెప్పాలా?

మనం తినే పప్పే నిప్పయి ముప్పయి పోయిన తరుణం ఇది. ఇక స్త్రీ శిశువుల మాట సరేసరి - ఆసుపత్రి గోడల ప్రక్కన, ఆడ శిశువులు ఊరకుక్కల విస్తరి భోజనా లవుతున్నారు. పాపం, పుణ్యం తెలియని పసికూనలు పాషాణ హృదయుల అత్యాచారానికి బలవుతున్నారు. గ్యాంగ్ రేప్‌లు, ఈవ్ టీజింగ్స్, బ్లాక్ మెయిలింగ్‌లు ఉన్మాదానికి పరాకాష్ఠగా నిలుస్తున్నాయి. శారీరక మానసిక వెతల పాలవుతోంది మహిళ. ఢిల్లీ, ముంబయి, మద్రాసు, హైదరాబాదు, కేరళ, బెంగళూరు, గుజరాత్, కొల్‌కత్తాలలో మహిళల దిక్కులేని మానం మూకుమ్మడిగా వేయబడుతోంది వేలం!! ఇరుకు బందీఖానాల్లో జీవితం, నరకాల 'గడీ'ల్లో వ్యభిచారం తప్పని శాపమై మగ్గుతున్న మగువల గుండె ఘోషలు! బలయ్యే మూగ జీవాల అర్తనాదాలు!!

మహిళా రక్షణ, సతీ సహగమనం వ్యభిచార నిరోధక చట్టాలన్నీ నిస్సహాయంగా కోర్టు సెల్ఫు పుస్తకాల వరకే పరిమిత మవుతున్నాయి. కళ్ళు లేని చట్టం, కుళ్ళు నిండిన రాజకీయం, హృదయం లేని అధికారం, పంజరంలో ప్రజాస్వామ్యం, నీతి లేని నాయకత్వం మహిళల దుస్థితికి, అప్రజాస్వామిక పరిస్థితికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి.

అవును మరి - పువ్వులు సువాసనల్ని వెదజల్లితే అది తోట. మనసును మైమరపించే రాగం వినబడితే అది పాట. స్వార్థానికి, అమానుషత్వానికి అమాయకులు బలయితే అది రాజకీయ ఆట. ఇవేవో మనకు సంబంధం లేని విషయాలని అనుకోకండి. ఒక కేసుతో మీకు ఎలాంటి సంబంధం లేకపోయినా సృష్టించి, శృతులు కల్పి మరీ మిమ్మల్ని ఇరికిస్తారు. ఇరకాటంలో పడేస్తారు - దటీజ్ పొలిటిక్స్!

ఇదిగో వచ్చేశాం. ప్రతి మనిషి ఎక్కడికి చేరుకోవాలో అక్కడికి వచ్చేశాం. చాలీ చాలని జీతాలతో చిరు సుఖాన్ని సైతం చవి చూడకుండా, చితికి చితికి, చితికి ఆహుతి అవుతున్న పేద బ్రతుకులు. తల దాచు కునేందుకుగాను వేసుకున్న ఆ పూరి గుడిసె స్థలాల్ని సైతం కబ్జా పేరుతో కబళిస్తున్న కాళ సర్పాలు... వడ్డీ.. చక్ర వడ్డీ... బారు వడ్డీలతో పేదోడి నడ్డి విరగ్గొడుతున్న కనక పిశాచులు... ధన పిపాసులు...!! ఇవి చాలవన్నట్టు ఉగ్రవాదం ఒకటి.

ఈ పాపం దేశానిదా? కాదు... కానే కాదు... ఈ దేశ ప్రజలది. ఖచ్చితంగా చెప్పాలంటే ఈ దేశంలోని కొందరిది... అయితే ఒక్కటి మాత్రం నిజం... మోసం చేస్తున్నది కొందరే. దాన్ని పట్టించుకోని, గుర్తు పట్టని అజ్ఞానం మాత్రం అందరిది... మనందరిది. మన అజ్ఞానం, అశ్రద్ధ, అలసత్వం, అంధానుసరణ అంతం కానంత వరకు సమస్యలు పరిష్కారం కావు. ఎవరో ఒకరు, ఎపుడో ఒకప్పుడు వేయాలనుకునే 'ఆ అడుగు' మనం ఎందుకు కాకూడదు? అవును విజయం అడుగు దూరంలోనే ఉంటుంది. అది కొందరికే లభిస్తుంది - అడుగేసి అలసిపోని వాళ్ళకు!!



ముహమ్మద్ బిలాల్

# ప్రజల 'నాడి' తెలిసిన డాక్టర్

(డా. వై. యస్. రాజశేఖర్ రెడ్డి సేవలను ఆంధ్రజాతి మరువజాలదు. ఆయన్ని అభిమానించేవారే కాదు, రాజకీయంగా ఆయనతో విభేదించేవారు సైతం ఆయనగారి అలుపెరగని కృషిని శ్లాఘించకుండా ఉండలేరు. ముఖ్యంగా కడప జిల్లా వాసులు ఈ షాక్ నుండి ఇప్పుడిప్పుడే తేరుకుని, తమ దివంగత నాయకుని సేవలను నెమరు వేసుకుంటున్నారు. కువైట్‌లో అత్యధికంగా ఉన్న మన కడప జిల్లా సోదరుల శోకసంతప్త అంతరాళాలను దృష్టిలో పెట్టుకుని, అదే జిల్లా వాసియైన మా సహచరులు ముహమ్మద్ బిలాల్ గారు (ఐ.పి.సి ప్రబోధకులు) తన మనోభావాలకు అక్షర రూపమిచ్చారు - ఎడిటర్ )



దివంగత ముఖ్యమంత్రి వై. ఎస్. రాజ శేఖర్ రెడ్డి ఓటమి ఎరుగని నేత. ఎన్నికలలోనే కాదు, ప్రజల హృదయాలను సైతం గెలిచిన నాయకుడు. తనని నమ్మినవారిని ఏ మాత్రం మరువలేదు. తన కష్టనష్టాలను, సుఖ దుఃఖాలను వారితోనే పంచుకున్నారు. ఆప్యాయతగా భుజంపై చెయ్యివేసి పేరుపెట్టి పిలిచి పలుకరించేవారు. అసంతృప్తితో ఉన్నవారు కూడా ఆ ఆప్యాయతకు కరిగి పోయేవారు. ఆ ఆప్యాయతే ఆయనకు కవచమై చట్ట సభల్లోకి నడిపించింది. ఆయన మాత్రం ఎంత ఎత్తుకు ఎదిగినా తన ప్రజల్ని మరిచే వారు కాదు. ఎదిగేకొద్దీ ఒదిగి ఉందామని తన సహచరులకు హితవు చెప్పారు. ఫోన్ చేస్తే చాలు పనులు చేసిపెట్టేవారు. ఆ విధంగా తన ప్రజలను ముఖ్యంగా జిల్లా వాసులను ప్రత్యేక శ్రద్ధతో చూసేవారు. ఆయన పేరు చెప్పుకుని చిన్న చిన్న నాయకులు సైతం పనులు చేయించుకునేవారు.

ఒక డాక్టరుగా ప్రజలకు పులివెందులలో సేవలు చేస్తూ యువజన కాంగ్రెస్ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ప్రముఖుల సలహా మేరకు 1978లో తొలిసారిగా కాంగ్రెస్ (ఆర్) తరపున పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు. తర్వాత కాంగ్రెస్(ఐ)లో చేరిపోయారు. ఆ తరువాత వెనుదిరిగి చూడలేదు. ఓటమి ఎరుగని ఎమ్మెల్యే, ఎంపీగా తన నియోజక వర్గాన్ని కంచు కోటగా మలచుకున్నారు. తన వర్గానికి అన్యాయం జరిగినా, తనను విస్మరించినా ప్రతి పక్షమైనా, స్వపక్షమైనా, వారు ఎంతటి హోదాలో ఉన్నా ముక్కు సూటిగా విమర్శించేవారు. ఆ కారణంగా ఆయన తొందరగా ప్రముఖుల దృష్టిలో పడ్డారు. రాష్ట్ర పి.సి.సి. అధ్యక్ష పదవి సైతం ఆయన్ని రెండు సార్లు వరించింది. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రజలకు మరింత దగ్గరయ్యారు. 2004 లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని సాధించి పెట్టి సి.ఎం. అయ్యారు.

ప్రజలు కూడా అధికారం ఉన్నా, లేక పోయినా ఆయన్ను అంటిపెట్టుకొని ఉన్నారు. నీరాజనాలు పట్టారు. ముఖ్యంగా రెండవసారి ముఖ్యమంత్రి అయినప్పుడు రాష్ట్ర ప్రజలకు మరింత చేరువయ్యారు. ప్రజలకు పనికొచ్చే కార్య క్రమాలను ఎన్నింటినో చేపట్టారు. నేను కూడా రైతు బిడ్డనే, మీ వాడినే అని నాగలి చేత బట్టారు. అన్ని జిల్లాలలో పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్ళారు. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలబడి ప్రముఖుల మన్ననలు అందుకున్నారు. దేశంలోనే కాక విదేశీ పాలకుల మన్ననలు సైతం పొందారు. ఎన్నో సంవత్సరాల నుండి తెగని తెలంగాణా విషయంపట్ల ఆయన తనదైన శైలిలో ప్రవర్తించి తెలంగాణ ప్రజల హృదయాలను గెలిచారు. దానికి నిదర్శనమే మే 2009 ఎలక్షన్‌లు.

తీరిక చిక్కినప్పుడల్లా కడప జిల్లాకు వచ్చి ప్రముఖులతో, అధికారులతో చర్చించేవారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని తపించేవారు. తాను విపక్షంలో ఉండటంతో పాటు... స్వపక్షంలోనూ విపక్ష తరహా రాజకీయాల్ని అనుసరించినందున జిల్లాలో 20 ఏండ్లుగా అభివృద్ధి ఆగిపోయిందని భావించి ఆయన ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాక విమర్శల్ని లెక్కజేయక జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టారు. పులివెందుల లాంటి చిన్న పట్టణానికి అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మించారంటే అక్కడి అభివృద్ధిపై ఆయన పడిన తపన అర్థమవు తుంది.

### పారిశ్రామికంగా...

ముఖ్యమంత్రి పదవినలంకరించిన తరువాత కడప జిల్లాలో ఆయన నెలకొల్పిన పరిశ్రమలు.

(1) జమ్మలమడుగు వద్ద బ్రహ్మిణి స్టీల్ ఫ్యాక్టరీ.
(2) కడప సమీపంలో రఘురామ్ (భారతి) సిమెంట్ ఫ్యాక్టరీ.
(3) చెన్నూరులో మూతపడిన చెక్కర ఫ్యాక్టరీ పునరుద్ధరణ.
(4) పులివెందుల చుట్టుప్రక్కలా చిన్న తరహా పరిశ్రమలు.
(5) నగర శివార్లలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం 5 వేల ఎకరాల స్థల సేకరణ. ఈ స్థలంలోనే గ్రిమాక్ అనే సంస్థ భారీ స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పా టుకు అంగీకారం.
(6) సిద్దవటం మండలం పెద్దపల్లెలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం.
(7) రైల్వేకోడూరు సమీపంలో శెట్టిగుంటవద్ద అపాచీ షూస్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన.
(8) ప్రొద్దుటూరులో చేనేత కార్మికుల కోసం అప్పరెల్ పార్క్ ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి, పనులు మొదలు.

ఇలా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరు ముందుకొచ్చినా వారికి సంపూర్ణ సహాయ

సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హోదాలో హామీ ఇచ్చారు. వేలమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారు.

### విద్యా ప్రదాత...

రైతు బాంధవుడిగా పిలిపించుకొనే రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్లీనంగా విద్యావేత్త. ప్రదాత కూడా. జిల్లాలో అనేక విద్యా సంస్థలను స్థాపించారు.

(1) 120 కోట్లతో రాజీవ్ గాంధీ విద్యా వైజ్ఞానిక సంస్థను నెలకొల్పారు. సెమి అటానమస్ హోదాను ఇచ్చారు. అక్కడే దంత వైద్యశాల ఏర్పాటు కూడా చేయించారు.

2) అసౌకర్యాల మధ్య ఉన్న ఎస్.వి.యు పీజీ కేంద్రాన్ని దేశంలోనే గర్వించదగ్గ విశ్వ విద్యాలయంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. 2005లోనే దీనికి అనుమతినిచ్చారు. కావలసిన నిధులను సమకూర్చారు.

(3) రాష్ట్రంలోని అన్ని ట్రిపుల్ ఐటిలకు కేంద్రంగా రాజీవ్ గాంధి నాలెడ్జి టెక్నాలజీ డబుల్ ఐటీ సంస్థ, తలమానికంగా జె.యన్.టి.యు., ప్రొద్దుటూరుకు వై.వి.యు ఇంజనీరింగ్ కళాశాల, క్రొత్తగా 7 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేశారు.

(4) ఐజీ కార్ల్ పరిశోధనా కేంద్రం, అగ్రి కల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, వెటర్నరీ పాలి టెక్నిక్ కళాశాల, 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 3 డిగ్రీ కళాశాలల స్థాపనకు అనుమతినిచ్చారు.

(5) ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన మొదటి సంవత్సరమే 14 కస్తూర్బా పాఠశాలలను జిల్లాకు కేటాయించారు. తర్వాత ఈ పాఠశాలలు 19కి చేరుకున్నాయి.

(6) 2005 లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అత్యాధునిక వసతులతో నెలకొల్పారు. 12 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నారు.

(7) కేంద్రీయ విద్యాలయం, 2006 లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేశారు.

(8) గురుకుల కళాశాల ఏర్పాటు చేయించి గ్రామీణ ప్రాంతంలోని సాధారణ డిగ్రీ చదివిన వారు సాఫ్ట్‌వేర్ రంగంవైపు వెళ్ళేందుకు దారి చూపారు.

(9) జిల్లాలో 320 పాఠశాలలు ఉంటే వాటిలో 295 స్కూళ్ళను గుర్తించి ఒక్కో పాఠశాలకు 75 లక్షలు కేటాయించి కార్పోరేట్ తీరులో తీర్చి దిద్దే ప్రయత్నం చేశారు.

(10) జిల్లావాసులు ఎంసెట్ కౌన్సెలింగుకు ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా కడపలోనే పాలిటెక్నిక్ కళాశాలలో అదనంగా భవనాలను నిర్మించి అందులోనే కౌన్సెలింగ్ జరిగేటట్లు ఏర్పాట్లు చేశారు.

### వైద్య సేవలు.....

స్వతహాగా డాక్టర్ అయిన వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు తన జిల్లాలో వైద్య సేవలు అందించకుండా ఉంటారా?!

జిల్లాలో వివిధ ప్రాంతాలలోని ఆసుపత్రులను వాటి సామర్థ్యాన్ని పెంచి దానికి సరిపడా డాక్టర్లను, నర్సులను పెంచారు. 450 మంది ఏ.ఎన్.ఎం. లను నియమించుకొని వైద్య సేవలను ప్రజలకు దగ్గరగా తీసుకెళ్ళారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం 15 మే 2008 న మైదుకూరులో లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 10 వేల మంది శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. అందుకుగాను 35 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇలా చెప్పుకుంటూపోతే అనేకం. కడప జిల్లాకే కాకుండా అన్ని జిల్లాల గురించి తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజల హృదయాలను జయించారు. ఈయన ప్రజల మనిషి అనడానికి ఆయన మరణ వార్త వినగానే 150 మందికి పైగా (గుండె నిలిచిపోయి, ఆత్మహత్యల ద్వారా) మరణించారంటే ఆయన ఎంతగా ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేశారో అర్థమవుతుంది. పెద్ద పెద్ద నాయకులు చనిపోయినప్పుడు కూడా ఇలా జరగలేదు. ఇలాంటి అభిమానం సంపాదించడానికి ఆయన ఎంతగా పరిశ్రమించారో తెలుస్తుంది. అవిశ్రాంత కృషి, ఆప్యాయత, నిరాడంబరతే ఆయన ఆయుధాలు. అలాంటి నాయకుని మరణం రాష్ట్రానికే కాదు, దేశానికే ఓ పెద్ద లోటు.

## ఎదురు లేని మనిషి

**పూర్తి పేరు:** యెదుగూరి సందింటి రాజశేఖర్ రెడ్డి
**జననం:** 8-7-1949, **మరణం:** 3-9-2009
**జన్మస్థలం:** బలపనూరు (సింహాద్రిపురం మండలం, కడప జిల్లా)
**సతీమణి:** విజయ లక్ష్మి
**వివాహం:** 9-2-1972
**పిల్లలు:** కుమారుడు: జగన్మోహన్ రెడ్డి. **కుమార్తె:** షర్మిల
**తల్లిదండ్రులు:** రాజారెడ్డి, జయమ్మ
**సోదరులు:** జార్జిరెడ్డి, వివేకానందరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి
**సోదరి:** విమలమ్మ

### విద్యాభ్యాసం

(1) **పులివెందుల:** వెంకటప్ప ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్య
(2) **బళ్ళారి:** మిషన్ హైస్కూల్, ఒక సంవత్సరం బి.యస్సి.
(3) **విజయవాడ:** లయోలా కాలేజీలో (పి.యు.సి.)
(4) గుల్బర్గ ఎమ్మార్ మెడికల్ కాలేజీలో యం.బి.బి.యస్.
(5) ఎస్.వి. మెడికల్ కాలేజీలో పిజి

### రాజకీయ క్రమ వికాసం

(1) 1975లో యువజన కాంగ్రెస్ సెక్రటరీగా ఆరంగేట్రం
(2) 1978లో తొలిసారిగా రెడ్డి కాంగ్రెస్ తరఫున పులివెందుల నుంచి ఎమ్.ఎల్.ఎ.గా
(3) కడప, రాజంపేట లోక్‌సభ నియోజక వర్గాలనుంచి 4 సార్లు ఎం.పీ.గా ఎన్నిక
(4) పులివెందుల నుంచి 6 సార్లు ఎం.ఎల్.ఎ. గా విజయ ఢంకా
(5) 1983,1998 లలో రెండు సార్లు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎంపిక
(6) 2004 ఏప్రిల్ నుంచి 2009 సెప్టెంబర్ వరకు ముఖ్యమంత్రి
(7) 1980 - 1982 వరకు అంజయ్య, భవనం వెంకట్రాంరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి మంత్రి వర్గాల్లో రాష్ట్ర మంత్రిగా నియామకం

### ప్రత్యేకతలు

(1) పోటీ చేసిన ఏ నియోజక వర్గంలో కూడా ఓటమి ఎరుగని నాయకుడు.
(2) 2004లో కాంగ్రెస్ అవసాన దశలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి పార్టీకి జీవం పోశారు.

# తహజ్జుద్ వరాలు

– ఇబ్నె యూనుస్

**రాత్రిపూట దట్టమైన చీకటి ఒడిలో లోకమంతా సేదదీరుతున్నవేళ... మనుషులు, పక్షులు, పశువులు, మృగాలు – సమస్త ప్రాణకోటి తమతమ గూళ్ళలో ఆదమరచి నిద్దరవుతున్న వేళ... కొన్ని శుభాత్మలు మెత్తని పరుపులను వదలి 'పుజా' చేయడానికి వెళుతున్నాయి. ఆ ఘడియల్లో వారి అంతరాళాలు తమ ప్రియతమ స్వామి పట్ల ప్రేమాతిశయంతో ఉవ్విళ్ళూరుతున్నాయి.**

ఆ క్షణంలో వారు భూలోకంలోని ప్రాణుల కంటికి కానరాకపోవచ్చు. కాని ఊర్ధ్వలోకాల్లో ఉజ్వల తారల్లా దేదీప్యమానంగా వెలిగి పోతుంటారు. వారి హృదయాల్లో ఆర్ద్రత ఉంది, ఆరాటముంది. ఈ ఆరాటమే వాళ్ళను అనునిత్యం అవిశ్రాంత పోరాటానికి, అభ్యాసానికి పురికొల్పుతూ ఉంటుంది. వారి ఉబలాటమల్లా ఒక్కటే – తమ ప్రభువైన అల్లాహ్‌ను మెప్పించాలి! ఆయన ప్రసన్నతను బడయాలి!! ఆయనకు విశ్వాస పాత్రులుగా మసలుకోవాలి!!!

రాత్రి పొద్దుపోయింది. లోకమంతా గాఢ నిద్రలో మునిగిపోయింది. కాని ఈ 'ప్రేమ పిచ్చోళ్ళు' తమ ప్రియతముని సమక్షంలో చేతులు చాచి, ప్రేమ భిక్షను యాచిస్తున్నారు. కన్నీటితో వారి గడ్డాలు తడిసి ముద్దవుతున్నాయి. మరోవైపు ఆకాశాల్లో కారుణ్య గేట్లు తెరచుకుంటున్నాయి. స్వర్గ కన్యలు వారి దృష్టిని తమ వైపుకు మరల్చుకోవాలని ఆరాటపడుతున్నాయి. కాని ఈ 'పిచ్చి మారాజులు' మాత్రం వారి వంక కన్నెత్తి అయినా చూడరు. వీళ్ళ ధ్యేయమల్లా ఒక్కటే – ముందు తమ నిజస్వామి ప్రేమానురాగాలకు నోచుకోవాలి. ఆయన్ని సంతుష్టపరచాలి. ఆయనతో ఒక అంగీకారానికి రావాలి.

జాము రాత్రి గడియ ఆసన్నమయింది. ఆకాశం నుంచి కురిసే కారుణ్య జల్లు కాస్తా కుండపోతగా మారింది. అడిగేవారందరికీ కృపాకరుడు ఇస్తున్నాడు. 'ఏం కావాలో అడగండి. అడిగిందల్లా అనుగ్రహించబడుతుంది' అన్న ప్రకటన వెలువడుతుంది. అదిగో అంతలోనే దైవ ప్రసన్నతా కిరణాలు ప్రసరించసాగాయి. వారికి కావలసిందీ అదే. అదే వారి అసలు గమ్యం. దాని కోసమే వారు ప్రతి రాత్రీ తియ్యని నిద్రను వదలి స్వామి సన్నిధిలో అణకువతో నిలబడుతున్నారు. అందుకే అల్లాహ్ ఈ శుభాత్మల గురించి తన గ్రంథంలో ఇలా ప్రస్తుతించాడు:

**"వారి వీపులు వారి పడకల నుంచి వేరై ఉంటాయి. వారు తమ ప్రభువును భయంతోనూ, ఆశతోనూ ప్రార్థిస్తారు".**

(అస్ సజ్దా – 16)

దైవ మార్గంలో సర్వస్వాన్ని అర్పించటానికి సిద్ధపడే ఈ త్యాగధనులకు బహుమానంగా అల్లాహ్ ఏం సిద్ధంగా ఉంచాడు? అది మన ఆలోచనలకు అందనిది:

**"వారు చేసిన కర్మలకు ప్రతి ఫలంగా వారి కళ్ళకు చలువనిచ్చే ఎలాంటి సామగ్రిని మేము దాచిపెట్టామో (దాని గురించి) ఏ ప్రాణికీ తెలియదు".** (అస్సజ్దా – 17)

వారికి లభించే బహుమతి ఏమిటో స్పష్టంగా చెప్పబడలేదు. కాని ఆ బహుమతితో వారి కంటికి చలువ లభిస్తుందని మాత్రం ప్రకటించబడింది. దాచి పెట్టబడిన ఆ బహుమానం పట్ల దేవుడు తన దాసుల్లో ఉత్సుకతను మరింతగా పెంచి సదాచరణ వైపు ప్రోత్సహిస్తున్నాడు.

వేరొక చోట దేవుడు తన ప్రియతమ ప్రవక్త (స) నుద్దేశించి ఇలా సెలవిచ్చాడు –

**"రాత్రిపూట కొంతభాగం తహజ్జుద్ (నమాజు)లో ఖుర్ఆన్ పారాయణం చెయ్యి. ఇది నీ కొరకు అదనం. త్వరలోనే నీ ప్రభువు నిన్ను 'ప్రశంసాత్మక స్థానానికి (మఖామె మహ్మూద్) చేరుస్తాడు".**

(బనీ ఇస్రాయీల్ – 79)

ఇలాగే అనేక హదీసుల్లో కూడా తహజ్జుద్ నమాజ్ ప్రాశస్త్యం ఏమిటో తెలుపబడింది. ఉదాహరణకు : ఒక సారి దైవ ప్రవక్త (స)




**జాము రాత్రి గడియ ఆసన్నమయింది. ఆకాశం నుంచి కురిసే కారుణ్య జల్లు కాస్తా కుండపోతగా మారింది. అడిగేవారందరికీ కృపాకరుడు ఇస్తున్నాడు. 'ఏం కావాలో అడ గండి. అడిగిందల్లా అనుగ్రహించబడు తుంది' అన్న ప్రకటన వెలువడుతుంది. అదిగో అంతలోనే దైవ ప్రసన్నతా కిరణాలు ప్రసరించసాగాయి. వారికి కావలసింది అదే. అదే వారి అసలు గమ్యం.**

ఇలా ఉపదేశించారు: "ప్రజలారా! సలాంను వ్యాపింపజేయండి. (ఆకలి గొన్నవారికి) అన్నం పెట్టండి. రాత్రిపూట జనులు నిద్రిస్తుండగా నమాజు చేయండి (ఇలా గనక చేశారంటే) మీరు నిక్షేపంగా స్వర్గంలో ప్రవేశిస్తారు". (తిర్మిజి)

సాధారణంగా ప్రజలు ఈ విషయాలను అతి మామూలు విషయాలుగా భావిస్తారు. కాని ఇదెంత బహుమూల్యమైన సంపదో విలువను గుర్తించే వారికే తెలుసు. మరి ఈ సౌభాగ్యాన్ని పొందడానికి పెద్దగా వ్యయ ప్రయాసలకు ఓర్చుకోవాల్సిన అవసరం కూడా లేదు. కాకపోతే ఓపిక ఉండాలి. దైవ ప్రవక్త (స) తహజ్జుద్ నమాజులో ఎంతో తాదాత్మ్యం చెందుతూ ఖుర్ఆన్ పఠిం చేవారు. దాంతో ఆయన (స) పాదాలపై వాపు వచ్చేసేది. "దైవ ప్రవక్తా! (స) దేవుడు మీ పొరపాట్లను మన్నిస్తున్నట్లు ప్రకటించ బడింది కదా! మరి మీరెందుకు ఇంతటి కఠోరమైన అభ్యాసానికి పూనుకుంటున్నారు" ని ధర్మపత్ని ఆయిషా (ర.అ) అడిగితే "నేను దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునే దాసుణ్ణి కానవసరం లేదా?" అని బదులిచ్చారు ఆయన (స).

స్వర్గంలో అందరికంటే ముందు ప్రవేశి స్తారని వాగ్దానం చేయబడిన మహనీయుని పరిస్థితి ఇది!

మరి మనమూ ఉన్నాం, పాపాల భారం క్రింద అణిగి ఉన్నాం. అయినా మనలో పరలోక చింతన లేదాయె. సదాచరణవైపు మన మనసు మొగ్గదాయె. మనలో స్వర్గాన్ని కాంక్షించని వారెవరు? మరైతే మనం మన కర్మల్ని తనిఖీ చేసుకుంటున్నామా? మన కర్మలు మనల్ని స్వర్గానికి హక్కుదారులుగా ఖరారు చేస్తున్నాయా? రాత్రి జాగారంలోని మాధుర్యాన్ని ఆస్వాదించే ఆ యువకులు



ఎంతటి అదృష్టవంతులు!? ఏ రోజునైతే అల్లాహ్ సింహాసనం (అర్ష్) నీడ తప్ప మరే నీడా లభించదో ఆ రోజున ఆ సింహాసనం నీడలో సేదదీరే సౌభాగ్య వంతులు వీరే.

అదృష్టవంతుడైన ఓ నవయువకుడా! ఈ దైవానుగ్రహం కారు చవుక ఏమీ కాదు. దాని కోసం తియ్యని నిద్రను త్యాగం చేయాలి. చన్నీళ్ళతో వుజూ చేసి స్వామి సన్నిధిలో నించోవాలి. కడు నిస్సహాయు లుగా - విలపిస్తూ - క్షమాభిక్షకై వేడుకో వాలి. అప్పుడుగాని దైవ ప్రసన్నతా భాగ్యం ప్రాప్తించదు.

"ఎవరికి ఏది ప్రాప్తమైనా ఏకాంతంలోనే ప్రాప్తమైంది" అని ఒక పుణ్య పురుషుడు తరచూ చెబుతుండేవారు. ఈ విషయాన్నే మహాకవి ఇక్బాల్ ఈ విధంగా వివరించేం దుకు యత్నించారు.

"అతార్ కైనా, రూమీ కైనా, రాజీకైనా,
గజాలీ కైనా
జాము రాతిరి వినతి లేనిదే చేజిక్కదేది".

రేత్రిళ్ళు లేచి తమ ప్రభువుతో గుసగుస లాడే ధన్యజీవులకు శతకోటి శుభాభినంద నలు. ఊర్ధ్వలోకాలలో సైరు చేసి, ఆధ్యాత్మి కంగా కీర్తి శిఖరాల అంబరాలను చుంబిం చేది ఈ శుభాత్మలే. వారు తమ తమ కాలాల్లో విద్యా వివేచనల లే కిరణాలను ప్రసరింపజేసి జగతిని జ్యోతిర్మయం చేస్తుం టారు. కాని మన పరిస్థితి కడు శోచనీయం! మనం ఆ పుణ్యాత్ముల గురించి గొప్పగా చెప్పుకుంటాం. వారి అంతస్తులు లభించా లని పగటి కలలు కంటాం. కాని ఆ మహనీ యుల జీవితాల్లోని క్రియాత్మక కోణాలను మాత్రం ఉపేక్షిస్తాం. వారిలోని చిత్తశుద్ధిని, సంకల్ప నిరతిని మనం పుణికి పుచ్చుకో గలిగితే మనలో కూడా రూమీలు, గజాలీలు ప్రభవిస్తారు. మనో మస్తిష్కాలను మంత్ర ముగ్ధం చేసే శాస్త్రీయ, సంస్కరణాత్మక సేవలు మళ్ళీ పునరావృతమవుతాయి.



అనురాగ రావం

# దివ్య కాంతులు భువిని తాకిన వేళ...!

మక్కా నగరానికి సమీపాన - కాంతి శిఖరం (జబలున్నూర్) మీద ఓ బిల్లి గుహలో చిన్నగా వెలుగుతున్న దీపం... ఆ దీపం వెలుగులో దేదీప్యమానంగా ఒక యువకుడి తేజోవంత వదనం కాంతుల్ని కుమ్మరిస్తూ ఉంది. గాలి జోరబడినప్పుడల్లా ఆ దీపం రెపరెపలాడుతోంది. ఆ యువకుడు దేని గురించో గంభీరంగా ఆలోచిస్తున్నాడు. కళాకాంతులీనే అతని ముఖంపై ఆవేదనా ఛాయలు ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి...! అదే హిరా గుహ...!! ఆయనే యువ ముహమ్మద్ (స).

ప్రశాంతత కోసమో, ఏకాంత ప్రదేశం కోసమో తను వెతకడం లేదు. ప్రజా సంక్షేమ, సమాజ శ్రేయ పథకాల కోసం తీవ్ర అన్వేషణ సాగిస్తున్నారు. ప్రజలు మూఢ నమ్మకాలలో పడి అలౌకికానందంతో ఆనందోత్సవాలు జరుపుకుంటున్నారు. వారిలో కపటం, మోసం, అసత్యం, దురాశ, లోభం, పగ, ద్వేషం, మోహం, కామం, నేరం - ఇన్ని ఉండటం ఆయన గమనించారు. ప్రజలు ప్రకృతి ధర్మాన్ని - మానవ నైజం వాంఛించే దానిని ఫాలో అవ్వకుండా, అర్థరహితమైన - సత్య దూరమైన జీవితం గడుపుతున్నారన్న సంగతి తెలుసుకున్నారు. ఆయన హృదయం ద్రవించింది.

దేశం - దేశ ప్రజల నిజమైన సంపద విద్యలో, విజ్ఞానంలో, విశ్వకర్త అన్వేషణలో ఉంటుంది కానీ, వెండీ బంగారాల్లో, విగ్రహ ప్రతిమల్లో, అంధ విశ్వాసాల్లో ఉండదని ఈ ప్రజలు గ్రహించేదెప్పుడు? ప్రజల జీవన విధానం చూసి నిర్ఘాంతపోయారు. పురాతన కాలంలో స్థాపించిన విగ్రహాల, పంచ భూతాల ఆరాధన వారిది. వాటి ముందు రకరకాల నైవేద్యాలు పెట్టి పూజించడాన్ని నిరసించారు. అయితే స్వయంకృతాపరాధులైన తన పుర ప్రజలంటే గుండెలో ఎంతో ప్రేమ.

అజ్ఞానాంధకారాల్లో కొట్టుమిట్టాడుతున్న అశేష జనవాహినిని చూసి అశ్రుపూరి తులయ్యారు యువ ముహమ్మద్ (స). నరక కూపంలో పడేసే బహు దైవారాధనను బహు ఇష్టంగా అభిమానిస్తూ తమ నరకాగ్ని తలుపుల్ని తామే తెరుచుకుంటున్నారే! అని తల్లడిల్లిపోయారు. సమాజంలో ప్రభువులు, సంఘ పెద్దలు సాగిస్తున్న రాక్షస ఆగడాలను చూసి చలించిపోయారు. అన్నీ గమనించి, చెడు, దుర్మార్గం, అన్యాయం, అక్రమం, మూఢ విశ్వాసాలు అనేవి లేకుండా, ప్రజలు భార రహితులుగా, స్వేచ్ఛాపూరిత - శాంతియుత జీవితం గడపాలని, ఆ రోజు త్వరలోనే రావాలని ఆకాంక్షించారు.

స్ఫూర్తిదాయకమైన హితవులతో, పవిత్రమైన భావాలతో, నిర్దిష్టమైన పథకాలతో, నిండైన ఉత్సాహంతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలనుకున్నారు. ఆయన కోరేది ఏ మాత్రం అజ్ఞానం దరి చేరని, పూర్తిగా మేల్కొన్న శాంతి సమాజం. తన విశిష్టమైన మేధాసంపత్తితో మానవ జాతి మొత్తాన్ని జాగృత పర్చాలనుకుంటున్నారు.

'నక్కలకు బొరియలున్నాయి. పక్షులకు గూళ్ళున్నాయి. మానవ మాత్రునికి తల దాచుకోవడానికి చోటు లేదు' అన్న ప్రవక్త ఈసా (అలైహిస్సలాం) మాటలకు అక్షర నిలయమైన ఆ సమాజంలో; ఏళ్ళ తరబడి పెనవేసుకున్న విష సంస్కృతుల్ని కూకటి వేళ్ళతో పెకలించేందుకు తను పెను తుఫాను అవ్వక తప్పదు. అజ్ఞానంతో మూతబడ్డ జీవన నేత్రాలను జ్ఞాన కాంతులు చేరవేసి తెరిపించాలి. అవును - అజ్ఞానుల కు జ్ఞానజ్యోతులిచ్చి వెలుగు బాట చూపి నడిపించేందుకు తను కాలి కాంతినిచ్చే దీపం అవ్వాలి. ఇదే యువ ముహమ్మద్ (స) ధ్యేయం! అదే ఆయన అన్వేషణ!!

నిజమే - ఆలోచనలే మనుషుల్ని ఉత్తముల్ని చేస్తాయి. అవును - ఏకాంతంలో వివేకి అందుకోలేని ఎత్తుకు ఎదుగుతాడు. అవివేకి అధఃపాతాళానికి అణగుతాడు. యువ ముహమ్మద్ (స) వారి ఆవేదనను, ఆత్మ ఘోషను ఆ పరమాత్మ ఆలకించి నట్టున్నాడు. తాను తలుచుకున్న మరుక్షణమే దివ్యావిష్కృతితో దైవ దూత జిబ్రీల్ దివి నుండి భువికి దిగివచ్చారు. 'ఇఖ్‌ర'-చదువు - విద్యా విజ్ఞానాలే వీటన్నింటికి ఏకైక పరిష్కారం' అని విశదపర్చారు.

దైవ దౌత్య బాధ్యతను యువ ముహమ్మద్ (స) వారి భుజాల మీద వేసి, ఆయన్ను అంతిమ ప్రవక్తగా, ప్రవక్తలందరికీ నాయకుడిగా చేశాడు. 15 సంవత్సరాల నుండి మొదలైన తన అన్వేషణ ఇప్పటికి ఓ కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఓ నూతన విప్లవానికి తెర లేపింది. సత్యం - అక్షర సత్యం; చైతన్యరహిత జీవితం వసంతం లేని రుతువు లాంటిది. ధర్మబద్ధం కాని తిరుగబాటు నిర్మానుష్యమైన ఎడారిలో నీళ్ళున్నట్టు భ్రమింపజేసే ఎండమావి లాంటిది. 'జీవితం - తిరుగుబాటు- ధర్మం'



ఈ మూడూ విడదీయలేనివి. విడదీయ సాధ్యం కానివి. ఈ మూడూ ప్రతి వ్యక్తిలోనూ ఉండాలి.

జిబ్రీల్ - ప్రవక్త (స) మధ్య కాసేపు మౌనం చోటు చేసుకొంది. ఆ మౌనం తన మూగ సైగలతో ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది.

తామసిక ప్రేమతో, విగ్రహారాధనపై మోజుతో అలసిసొలసి మరణించినవారి జీవితం విష వాయువుల్ని చిమ్మే ముళ్ళ పొదలాంటిది. సాత్విక రహిత ప్రేమ, నిజమైన దైవం పట్ల భక్తిరహిత జీవితం - పూలు పూయని, పండ్లు కాయని వృధా వృక్షం వంటిది. సర్వ మానవ సౌభ్రాతృత్వం లేని భక్తి పరిమళం లేని పుష్పం లాంటిది. విత్తినా మొలకెత్తని సత్తు విత్తనం లాంటిదని తన మౌనాన్ని భాషగా చేసి చెప్పింది.

అవును - నిజమే. జీవితాన్ని రెండు సమాన భాగాలుగా విభజిస్తే, ఒకటి: చలికి గడ్డ కట్టేది. రెండు: మండి జ్వలించేది. ఆ రెండవ భాగమే ప్రేమ. ఆ ప్రేమను ప్రథమంగా దైవానికి సొంతం చేయాలి. ఆ తర్వాత ప్రవక్తకు, ప్రజలకు. ఆ ప్రేమ జ్వాలలను ఆరిపోనీయకూడదు. ప్రభువు పట్ల ఆరాధనతో, ప్రవక్త పట్ల అభిమానంతో, ప్రజల పట్ల ఆప్యాయతతో ప్రజ్వలిస్తున్న ఆ ప్రేమే మనల్ని అమృతాన్ని తాగిస్తుంది. మన జీవితాలకు వన్నె తెస్తుంది. స్వర్గ వనాలలో విహరింపజేస్తుంది. అటువంటి అత్యుత్తమ ప్రేమను మనకు అందుబాటులో ఉండేలా, అందేలా చేసేదే ధర్మం.

ప్రజల పట్ల ఆప్యాయతతో ప్రజ్వలిస్తున్న ఆ ప్రేమే మనల్ని అమృతాన్ని తాగిస్తుంది. మన జీవితాలకు వన్నె తెస్తుంది. స్వర్గ వనాలలో విహరింపజేస్తుంది. అటువంటి అత్యుత్తమ ప్రేమను మనకు అందుబాటులో ఉండేలా, అందేలా చేసేదే ధర్మం.

ధర్మం అంటే - దివ్య కాంతియే కానీ ప్రమాణాలు లేని శాస్త్రాల కూర్పు కాదు. అది హృదయ ప్రజ్వలనం - సంపూర్ణ జ్ఞానం. దివి నుండి భువికి దిగివచ్చిన దివ్య జ్యోతి - ధర్మం. దప్పికగొన్న సత్యాత్మలు తాగేందుకు పొంగి పొరలే జలనిధి - ధర్మం. ఆత్మలకు ఉపశమనం, ఓదార్పు కలిగించే ఇంపైన ట్యూన్స్‌ను ఇచ్చే అంతరాత్మ కోయిల రాగం - ధర్మం. దివ్య కాంతులతో భువిని తేజోవంతం చేసే దీపం - ధర్మం. మదిలో నివసించేది మానవత్వం అయితే, దాన్ని పెంచి పోషించేది, ఉత్తేజపర్చేది, ఉత్సాహాన్ని నింపేది - ధర్మం. అటువంటి ధర్మాన్ని తనలో నిక్షిప్తం, లీనం చేసుకున్న గ్రంథరాజమే అంతిమ దైవ గ్రంథం అయిన పవిత్ర ఖుర్ఆన్.

ధర్మం అంటే -
దివ్య కాంతియే కానీ
ప్రమాణాలు లేని శాస్త్రాల కూర్పు
కాదు. అది హృదయ ప్రజ్వలనం -
సంపూర్ణ జ్ఞానం. దివి నుండి భువికి
దిగివచ్చిన దివ్యజ్యోతి-ధర్మం. దప్పికగొన్న
సత్యాత్మలు తాగేందుకు పొంగి పొరలే
జలనిధి-ధర్మం. ఆత్మలకు ఉపశమనం.
ఓదార్పు కలిగించే ఇంపైన ట్యూన్స్‌ను
ఇచ్చే అంతరాత్మ కోయిల రాగం-ధర్మం.
దివ్య కాంతులతో భువిని తేజో
వంతం చేసే దీపం -
ధర్మం.

'ధర్మం- ఒక అవసరం కాదు, ఆత్మానంద పారవశ్యం, హృదయ గీతం, మనస్సు మంత్రముగ్ధం కావడం' అంటోంది ఖుర్ఆన్. ఎవరో చూస్తారని ఆచరించేది కాదు ధర్మం. ఎవరైనా వింటే ఏమౌతుందోనని పాటించేది కాదు ధర్మం. కళ్ళు మూసుకున్నా, బహిరంగ ప్రదేశాల్లో ఉన్నా, ఏకాంత కుహరాల్లో ఉన్నా కళ్ళ ఎదుట కదలాడే రూపమే ధర్మం. చెవులు మూసుకున్నా వినగలిగే దివ్య గీతమే ధర్మం అంటూ ధర్మానికి సరైన భాష్యం చెప్పింది ఖుర్ఆన్. 'ధర్మం నిత్యం పుష్పించే ఫలాల్నిచ్చే వనం. కానీ అనేక మంది ధర్మాన్ని ఐహిక వాంఛతో, ధన పిపాసతో సమీపిస్తారు. దాని పవిత్ర కిరీటాన్ని క్రిందకు లాగేసి, దాని పట్టు బట్టల్ని వారి పాప కర్మలతో అపవిత్రం చేయజూస్తారు' అంటూ స్వార్థపరులపై, సంకుచిత హృదయులపై, శాంతి విఘాతకులపై, మానవత్వపు శత్రువులపై ధ్వజమెత్తుతుంది ఖుర్ఆన్. ఆ మహత్తర, మహిమాన్విత గ్రంథమే మన ప్రియ ప్రవక్త (స) వారికి అనుగ్రహించబడింది. ఈ గ్రంథం ప్రకారం జీవించాలేగానీ, అత్యుత్తమ హోదా అంతస్థులను, కీర్తి ప్రతిష్ఠలను అనుగ్రహించే పూర్తి పూచి తనదంటుంది. అసలు ఖుర్ఆన్ వంటి బృహత్తర గ్రంథాన్ని పదహారణాల ఆచరణ ఛాయను ఇచ్చింది మన ప్రియ ప్రవక్త (స) వారే కదా! విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అ)ను ఆయన జీవితం గురించి అడిగినప్పుడల్లా ఆమె ఇచ్చిన సమాధానం: 'ఏమిటి? మీరు ఖుర్ఆన్ చదవటం లేదా - కాన ఖులుఖుహు అల్ ఖుర్ఆన్ అనేగా!!

ప్రవక్త - క్షుద్బాధ తీర్చే ఫల వృక్షమే ప్రవక్త వారి జీవితం. సహజత్వం - దయతో అలంకరించబడ్డ మూర్తిత్వమే మహా ప్రవక్త సందేశం. ప్రవక్త ప్రజల నుంచి ఏమీ ఆశించడు - ఒక్క సత్య స్వీకారం తప్ప! అయినా ప్రజల ప్రవర్తన విచిత్రం! వినయ విధేయతలను వస్త్రాలుగా ధరించి దైవ ప్రేమ వారికి సమీకరిస్తూ ఉంటే వారేమో ఆ ప్రవక్త ప్రేమ నుండి పారిపోతారు. అంధ విశ్వాసాల ఊబిలో మరింత లోతుకు పాతుకుపోతారు. పైపెచ్చు - ఆ ప్రేమనే అవమానం పాలు జేయడానికి, ఆవేదనకు గురి చేయడానికి ఆ ప్రేమపై అపనింద మోపి ఆ ప్రేమనే వెంటాడుతారు. ఆ ప్రవక్తనే హతమార్చ జూస్తారు.

ఆహా! ఆ కారుణ్యమూర్తిలోని శ్రేయోభిలాషను తెలుసుకోలేక ప్రజలు ఆయన్ను తిరస్కరిస్తారు. దైవ సందేశాల్ని, దివ్యావిష్కృతిని విడమరచి చెప్పినందుకు ప్రజలు ఆయన్ను వింతగా-కొత్తగా-చూస్తారు. 'ఇతనో పిచ్చోడు - మతి పోయింది' అంటారు. ఆ సత్యాన్ని ఆస్వాదించిన దివ్యాత్ముల్ని హింసిస్తారు. కొందరిని నిలువునా రంపంతో రెండుగా చీల్చేశారు. ఇంకొందర్ని అగ్ని గుండంలోకి విసిరేశారు. కొందరికి చిత్రహింసలు పెట్టారు. కొందరిని విషం పెట్టి చంపారు. ఇదే ప్రవక్తల పట్ల ప్రజల తీరు - నాటి నుండి నేటి వరకు!!

ప్రవక్తలు అనే ఈ వర్గం - వారు ఏనాడూ శత్రువుల ఎత్తుగడలకూ, శాంతి విఘాతకుల అఘాయిత్యాలకూ, ద్వేషంతో పీడించే కఠినాత్ములకు భయపడలేదు. అణగారిన దళిత జనాల్ని ఆదుకున్నారు. మోసాన్ని, ఘాతుకాన్ని అడ్డుకున్నారు. అసత్యాన్ని అంతమొందించారు. స్వేచ్ఛగా, నిర్భయంగా, సాహసోపేతంగా జీవించారు. యోధులుగా గుండె చాచి నిలబడ్డారే గాని, ఫిర్యాదు చేసిగాని, బాధతో గాని, ఏడ్చిగాని మృతి చెందలేదు. వారి ప్రేమ-దయ- కరుణ, సోదరభావం, సమభావం, సమత్వం, సాత్వికత కొన్ని వేల మంది మానవ హృదయాల్ని గాఢంగా హత్తుకుంటే, ఇంకొందరు వాటికి దూరంగా గిరి గీసుకొని బ్రతికారు. బరువుగానే ఈ లోకానికి వీడ్కోలు పలికారు. ఇక ఈ సత్యమూర్తితో, కారుణ్య ప్రవక్త పట్ల వారు ఎలా ప్రవర్తిస్తారో, ఆయన సందేశానికి వారు ఎలా ప్రతిస్పందిస్తారో వేచి చూడాల్సిందే అని తన మనోగతాన్ని పూర్తి చేసింది మౌనం.

హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్



# ఇమామత్ ఆదేశాలు

## ప్రజలకు ఇష్టం లేని వ్యక్తి ఇమామత్ చేయకుండా ఉండటమే మంచిది!

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ముగ్గురు వ్యక్తుల నమాజ్ వారి తల నుండి జానెడు దూరం కూడా పైకి (ఆకాశం వైపు అల్లాహ్ సాన్నిధ్యంలోకి) పోదు.

1) ప్రజలు ఇష్టపడని ఇమామ్.

2) రాత్రి పూట తన భర్తను అప్రసన్నుణ్ణి చేసిన స్త్రీ.

3) ఒండొకరి మీద అలిగిన ఇద్దరు సోదరులు. (ఇబ్నె మాజా)

## ఇమామ్ మరియు ముక్తదీలు నిలబడే స్థితి

ఇద్దరు వ్యక్తులు కలిసి నమాజ్ చేసేటప్పుడు ముక్తదీ ఇమామ్‌కు ప్రక్కన నించోవాలి. మూడో వ్యక్తి కూడా వారితోపాటు కలిసి నమాజ్ చేయాలనుకుంటే ముక్తదీలు ఇరువురూ ఇమామ్‌కు వెనక నించోవాలి. (ముస్లిం, అబూ దావూద్)

## ముక్తదీ పాటించవలసిన నియమాలు

**ముక్తదీ:** ఇమామ్‌ను అనుసరిస్తూ నమాజ్ చేసేవారిని 'ముక్తదీలు' అంటారు. ముక్తదీ నమాజుకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఇమామ్‌ను అనుసరించాలి. ప్రతి పనీ ఇమామ్ చేసిన తర్వాతే చెయ్యాలి. ఇమామ్‌కు ముందుగానీ లేక ఇమామ్‌తో పాటుగానీ ఏ పనీ చేయకూడదు. ఇమామ్ రుకూ చేసిన తర్వాతే తను రుకూ చేయాలి. ఇమామ్ సజ్దా చేసిన తర్వాతే తను సజ్దా చేయాలి.

దైవ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "మీరు ఇమామ్ కంటే ముందు ఏ పనీ చేయకండి. ఇమామ్ 'అల్లాహు అక్బర్' అన్న తర్వాతే మీరు అల్లాహు అక్బర్ అనండి.

ఆయన ఇంకా ఇలా అన్నారు: "నేను మీ ఇమామును. కనుక మీరు నా కన్నా ముందు రుకూ సజ్దాలు చేయకండి. నా కన్నా ముందుగా నిలబడటంగానీ, సలాంగానీ చేయకండి. (ముస్లిం)

ఇమామ్ కన్నా ముందు తల పైకెత్తేవాడు, తన తలను దేవుడు గాడిద తలగా మార్చేస్తాడేమోనని భయపడాలి. (బుఖారీ – ముస్లిం)

## సుత్రా ఆదేశాలు

నమాజ్ చేసే వ్యక్తి తన ముందు నుంచి వెళ్ళేవారి మూలంగా తన ధ్యానంలో అంతరాయం కలగకుండా ఉండటానికి ఏదయినా వస్తువును తన ముందు సుత్రాగా పెట్టుకోవాలని దైవ ప్రవక్త (స) ప్రబోధించారు. (అబూ దావూద్, ఇబ్నె మాజా)

సజ్దా చేసేటంత స్థలం వదలిపెట్టి సుత్రా ఉంచుకోవాలి.

## నమాజ్ చేసే వ్యక్తి ముందు నుంచి వెళ్ళడం పాపం

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నమాజు చేస్తున్న వ్యక్తి ముందు నుంచి వెళ్ళే వానికి అలా వెళ్ళటం ఎంత పెద్ద పాపమో తెలిస్తే, అతను నమాజు చేస్తున్న వ్యక్తి ముందు నుంచి వెళ్ళేకంటే తన స్థానంలోనే నలభై – యేళ్ళు, మాసాలు లేక రోజుల – వరకు ఉండిపోవడం మంచిదని గ్రహిస్తాడు". (బుఖారీ – ముస్లిం)

ఆయన ఇంకా ఇలా అన్నారు: "నమాజ్ చేస్తున్న వ్యక్తి తన ముందు నుంచి ఎవరినీ వెళ్లనివ్వకూడదు. ముందు నుంచి వెళ్ళే వ్యక్తి ఆగకపోతే, బలవంతంగానయినా అతన్ని ఆపాలి. ఎందుకంటే అతని వెంట షైతాన్ ఉంటాడు". (ముస్లిం)

## ఇమామ్ గనక తన ముందు సుత్రా ఉంచుకుంటే, ముక్తదీలు వేరుగా సుత్రా ఉంచుకోవలసిన అవసరం లేదు.

దైవ ప్రవక్త (స) విశాలమైన మైదానంలో నమాజ్ చేసినప్పుడు అక్కడ సుత్రాగా పనికొచ్చే వస్తువేదీ లేకపోతే తన ముందు ఈటెని పాతుకునేవారు. ఆ తర్వాత అనుచరులందరూ ఆయన సారథ్యంలో నమాజ్ చేసేవారు. (బుఖరీ – ముస్లిం)



– అబుల్ హసన్

# హృదయాల విజేతా! విశ్వ నాయకా!

హృదయాల విజేతా! విశ్వ నాయకా!
కారుణ్య ప్రవక్తా! కరుణా సాగరా!

పుట్టగానే పరిమళించావు
పరమత సహనం బోధించావు
అనాథగా నీవు పుట్టావు
అమీన్ సాదిఖ్ అన్పించావు
దైవదౌత్య పరిసమాప్తివి నీవు
దళిత జనులకండగా నిలిచావు
అంతిమ ప్రవక్తవై వచ్చావు
అంతరాత్మల్ని మేల్కొల్పావు
లోకం కోసం నీవు చేసిన మేలు
మరువజాలదు మనుజ జాతి
"హృదయాల...."

జ్ఞాన జ్యోతుల్ని వెలిగించి నీవు
అజ్ఞానాంధకారాన్ని తొలగించావు
మానవత్వాన్ని రగిలించి నీవు
మారణ హోమం ఆర్పావు
విద్య లేని వింత జనులకు నీవు
విద్యా వివేకాలను బోధించావు
అర్థం పర్థం లేని విశ్వాసాలను నీవు
అధఃపాతాళానికి నెట్టావు
అజ్ఞానాన్ని సొమ్ము చేసుకునే
విజ్ఞానాన్ని  నిరశించావు
నీవు చేసిన ఈ ఘన కార్యం
మరువజాలదు మానవ చరిత్ర
"హృదయాల...."

రాళ్ళు రప్పలు నీవు భరించి
రత్నాల్ ముత్యాల్ మాకిచ్చావు
బాధలు శిక్షలు నీవు సహించి
బాంధవ్యాలను నెలకొల్పావు
ధనం కాదు గుణం ముఖ్యం
అని ఘంటారావంగా చెప్పావు
నీతి లేని సమాజాన్ని నిద్ర లేపిన నీవు
న్యాయ వ్యవస్థను స్థాపించావు
"హృదయాల...."

పీడించే పురుష అహంకారంపై
వేధించే విష సంస్కృతిపై
యుద్ధభేరి మోగించి నీవు
మమతానురాగాలను పంచావు
స్త్రీ పుట్టు బానిస అన్న నోళ్ళను నీవు
మాతృ మహిమతో మూయించావు
ఆత్మ గౌరవం ఆస్తి పంపకం
అంతా స్త్రీకి కల్పించావు
పేరుకు తగ్గట్టు ప్రవర్తించి నీవు
అత్యంత ప్రశంసనీయుడనిపించావు
"హృదయాల...."





# బలవంతం ఏమీ లేదు

మతావలంబన విషయంలో బలాత్కారానికీ, ఒత్తిడికి, ప్రలోభానికీ తావు లేదని దివ్య ఖుర్‌ఆన్ నిర్దిష్టంగా చెప్పేసింది. "లా ఇక్రాహ ఫిద్దీన్".

అంతేకాదు, దేవుడు తన సందేశహరుణ్ణి (స) ఉద్దేశించి, (ఓ ప్రవక్తా!) సందేశాన్ని అందజేయటం, బోధ పరచడం వరకే నీ పని. ప్రజలపై నీవు కావలివాడవు కావు అని స్పష్టంగా చెప్పేశాడు. "ఇన్నమా అంత ముజక్కిర్. లస్త అలైహిమ్ బిముసైతిర్".

మహనీయ ముహమ్మద్ (స) మక్కా నుంచి మదీనాకు వలస పోయేనాటికి మదీనాలో మూడు ముఖ్య వర్గాల వారుండేవారు. 1)ముస్లింలు 2)యూదులు 3)ముష్రికులు. మానవ మనుగడను, మత సామరస్యాన్ని ఆశించి మహా ప్రవక్త (స) ఈ మూడు వర్గాల వారి మధ్య శాంతి, సామరస్యం, సహజీవనం ప్రాతిపదికలపై ఒడంబడిక చేశారు. ఒడంబడిక పత్రంపై ఈ మూడు వర్గాల ప్రతినిధుల చేత సంతకాలు చేయించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రతి మతస్థునికీ తన మత ధర్మాన్ననుసరించి జీవించే హక్కు ఉంటుంది.

మత వ్యవహారాలలో ముహమ్మద్ (స) చూపిన సహన భావం ఇస్లామీయ చరిత్రపై స్పష్టమైన ప్రభావం చూపింది. హజ్రత్ ఉమర్ (రజి) దగ్గర 'వసఖ్' అనే ఒక బానిస ఉండేవాడు. అతను ముస్లిం కాదు. ఇస్లాం స్వీకరించమని ఉమర్ (రజి) పలుమార్లు అతన్ని అభ్యర్థించారు. కాని అతను ఈ అభ్యర్థనను త్రోసి పుచ్చాడు. అయినాసరే ఉమర్ (రజి) అతన్నేమీ అనలేదు. మహాప్రవక్త (స) ఎప్పుడు సైనిక బృందాలను పంపించినా ధార్మిక స్థలాలకు, ఆరాధనాలయాలకు, ధార్మిక ప్రముఖులకు కీడు తలపెట్టరాదని సహచరులకు తాకీదు చేసేవారు. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) హయాంలో బైతుల్ మఖ్దిస్ (జెరూసలేం) జయించబడింది. ఆ సందర్భంగా అక్కడి చర్చీలో నమాజు చేసుకోవలసిందిగా క్రైస్తవ మతాచార్యులు ఖలీఫా ఉమర్ (రజి)ను కోరారు. వారి అభ్యర్థనపై ఆయన ఒకసారి అక్కడ నమాజు చేశారు. కాని వెంటనే ఆయన ఆలోచనలో పడిపోయారు. తాను అక్కడ నమాజు చేసిన దృష్టాంతాన్ని ఆధారంగా చేసుకుని తన అనుయాయులు ఎక్కడ ఆ స్థలాన్ని అక్రమించుకుంటారోనని, ఎక్కడ దాన్ని బలవంతంగా మస్జిద్‌గా మార్చేస్తారోనని ఆయనకు దిగులు పట్టుకుంది. అందుకే ఆయన (రజి) ఆ చర్చికి తన ప్రభుత్వం తరఫున ఒక ప్రత్యేక హామీ పత్రం రాసిచ్చారు. జెరూసలేము నగరంలోని ఇతర చర్చిలలో కూడా నమాజు చేసుకోమని అక్కడి పెద్దలు కోరినా ఆయన అక్కడ నమాజు చేయలేదు.

ధర్మాధర్మాల విషయంలో కూడా ముస్లింలు ఎన్నడూ ముస్లిమేతరులపై ఇస్లామీయ శాసనాలను రుద్దే ప్రయత్నం చేయలేదు. ఖుర్‌ఆన్ హదీసుల ప్రకారం మద్యం, పంది మాంసం ముస్లింల కొరకు నిషిద్ధం (హరామ్) అన్న సంగతి విదితమే. అయితే ఇస్లామీయ వ్యవస్థ ఉన్న రాజ్యంలో ముస్లిమేతరులకు వాటిని ఉపయోగించే, వాటి క్రయవిక్రయాలు జరిపే అనుమతి ఉంటుందని కూడా ఫుకహా (ధర్మవేత్తలు) తమ అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. ఒక ముస్లిం మరో ముస్లిం దగ్గరున్న మద్యాన్ని పారబోస్తే దానికి నష్టపరిహారం చెల్లించ వలసిన అవసరం లేదు. కాని ముస్లిమేతరుని మద్యాన్ని పారబోస్తే మాత్రం నష్టపరిహారం చెల్లించవలసి ఉంటుంది.

## మత పెద్దల పట్ల మర్యాదగా మసలుకోవాలి:

అన్య మతాల అధిపతులను, ప్రబోధకులను, పీఠాధిపతులను గురించి మాట్లాడేటప్పుడు వారి అనుయాయుల భావాలు, భావోద్రేకాలను పూర్తిగా దృష్టి యందుంచుకోవాలి. ఇది కూడా మత స్వాతంత్ర్యంతో ముడిపడి ఉన్న ముఖ్యాంశమే. దివ్య ఖుర్‌ఆన్ ఈ విషయంలో కొన్ని నిర్దేశిక నియమాలను నిర్ధారించింది. వాటిలో ముఖ్యమైన ఒక నియమం ప్రకారం "ఇతర జాతులవారు ఎవరినయితే పూజిస్తారో - అలా పూజించటం అధర్మమైనప్పటికీ - వారిని మీరు దూషించకండి".

అదీగాక ఈ నేపథ్యంలో దైవగ్రంథం, ముస్లింలకు ప్రసాదించిన దృక్పథం బహు విశాలమైనది. అదేమంటే దేవుడు అన్ని కాలాల్లో, అన్ని జాతుల వారిలో, అన్ని భాషలు మాట్లాడే వారిలో తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు. కాగా, వారిలో కొంత మంది పేర్లను మాత్రమే దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావించింది. ఈ విశ్వాసం ముస్లింలను ఇతర మతాల ప్రబోధకుల విషయంలో సదా సంయమనం పాటించేలా చేస్తుంది. బహుశా ఆ మహనీయులు, ఆ సంస్కర్తలు కూడా తమ తమ కాలాల్లో దైవప్రవక్తలుగానే వచ్చారేమో! వారు తమ జాతులకు ఇచ్చిన సందేశం దైవ సందేశమేనేమో! వారి తదనంతరం వారి అనుయాయులు ఆ సందేశంలో ప్రక్షిప్తాలకు పాల్పడ్డారేమో! అని ముస్లింలు తలపోస్తూ ఉంటారు.

కాస్త ఆలోచించండి! అంతిమ దైవ ప్రవక్త (స) ప్రభవనానికి కేవలం 600 ఏళ్ల క్రితమే దైవప్రవక్త ఈసా (ఏసు క్రీస్తు) ఏతెంచారు. కాని ఈ 600 ఏళ్ల మధ్యకాలంలోనే ప్రజలు దైవప్రవక్త ఈసా (ఏసు క్రీస్తు) ను దైవ దాసుని స్థానం నుంచి దైవత్వపు పీఠంపై కూర్చోబెట్టారు. ఆయన్ని దేవుని కుమారునిగా కూడా ఖరారు చేశారు. ఈనాడు ఏసు క్రీస్తును ఇంతకన్నా తక్కువ చేసి మాట్లాడితే క్రైస్తవ ప్రపంచం ఒప్పుకోదు. మరలాంటప్పుడు ఏసు క్రీస్తుకు పూర్వం కొన్ని వందల, వేల సంవత్సరాల క్రితం వచ్చిన ప్రవక్తల ప్రబోధనలను కూడా ప్రజలు కలగాపులగం చేసి వారి యెడల విపరీతంగా ప్రవర్తించారని అనటంలో విడ్డూరం ఏముందీ?

– అబూ అతీఖ్

# డా. జె.పి 'సత్తా'

వార్తల్లో వ్యక్తి

ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ప్రజా సమస్యల కోసం కేటాయించాల్సిన సమయం కాస్తా సభ్యుల వ్యక్తిగత ఆరోపణలకే సరిపోయింది. అయితే 294 మంది శాసన సభ్యులతో కొలువు తీరిన విధాన సభలో నడి వయస్కుడైన ఒక సభ్యుడు మాత్రం అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించారు.



అధికార పార్టీకి తాను ఇచ్చిన సూచనల దృష్ట్యానైతేనేమీ, ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనా తీరుపై స్పందించిన తీరు దృష్ట్యాగానీ, పరిపాలకుల విధానాలను ఎండగట్టిన వైనం రీత్యానైతేనేమీ ఆయన మా దృష్టిలో అత్యుత్తమ లెజిస్లేటర్! మంచి అపోజిషన్ లీడర్!! ఆయనే లోక్ సత్తా పార్టీ నాయకుడు డా. జయప్రకాష్ నారాయణ్.

హైదరాబాద్, కూకట్ పల్లి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి అతి కష్టం మీద గెలిచిన ఏకైక సభ్యుడు ఆయన. ఇలాంటి వారు మరో పది మందైనా ప్రజా ప్రతినిధులుగా గెలిచి విధాన సభకు వస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

అలనాటి (1975) లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్‌కి, ఈ లోక్‌సత్తా నాయకుడైన డా. జయప్రకాష్ నారాయణ్‌కి కొన్ని విషయాల్లో సామ్యం ఉంది. 1975లో లోక్ నాయక్ సంపూర్ణ విప్లవం (TOTAL REVOLUTION) చేపట్టి కాంగ్రెస్ పరిపాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వైనాన్ని మరువలేము. ఆఖరికి ఆ విప్లవం (1975) ఎమర్జన్సీకి దారి తీసింది, ఆనక కాంగ్రెస్‌ని గద్దె దించడంతోపాటు (1977) ఏకంగా రాయ్ బరేలీలో 'అమ్మ' గారి పరాజయాన్ని, అమేథీలో 'అబ్బాయి' (సంజయ్ గాంధీ) గారి ఓటమిని శాసించింది. అలనాటి లోక్ నాయక్ నుంచి స్ఫూర్తి పొందిన వ్యక్తే ఈనాటి 'లోక్ సత్తా' వ్యవస్థాపకుడు డా. జయప్రకాశ్. కాకతాళీయంగా ఇద్దరి పేర్లూ ఒక్కటే. కాకపోతే ఆయన జాతీయ స్థాయి రాజకీయ వాది. ఈయనేమో (ప్రస్తుతానికి) రాష్ట్ర స్థాయి నాయకుడు.

డా. జయప్రకాష్ నారాయణ్ ఉన్నత విద్యావంతులు. మెడిసిన్ చదువుకుంటూనే రాజకీయాల అవలోకనం చేశారు. అనంతరం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (IAS)లో ఉత్తీర్ణుడై ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో కలెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. 1996లో IAS ఆఫీసర్‌గా రాజీనామా చేసి లోక్ సత్తా సంస్థను స్థాపించారు. అప్పటి నుంచీ ప్రజా బాహుళ్యంలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతూ వస్తున్నారు. రాజకీయాల్లో అవినీతిని నిర్మూలించి, ప్రమాణబద్ధమైన రాజకీయాలను నడపాలన్నది ఈయన ఆశయం. సివిల్ సర్వీస్ ఆఫీసర్‌గా ప్రజల మధ్య గడిపిన వ్యక్తి గనక ఈయనకు ప్రజల అవసరాలు బాగా తెలుసు. ఏ విషయంపైనైనా దాపరికం లేకుండా సూటిగా మాట్లాడటం ఈయన స్వభావం. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సత్తా ప్రతినిధులను నిలబెట్టినా ఆశించినంత గొప్ప ఫలితం రాలేదు. కాని లోక్‌సత్తా పార్టీ టికెట్లు పొందిన అభ్యర్థుల చేత ఆయన అవినీతికి వ్యతిరేకంగా 'ప్రమాణం' చేయించి వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు.

లోక్ సత్తా తరపున ఏకైక ప్రతినిధిగా విధాన సభలో అడుగు పెట్టి పాలక పక్షానికి లోహపు గుగ్గిళ్ళను నమిలిస్తున్నారు. మంచి నీటి ఎద్దడిపై అసెంబ్లీలో చర్చ జరుగు తున్నప్పుడు డా. జయప్రకాష్ నారాయణ్ వెల్లడించిన వాస్తవం ఆలోచించదగినది.

ఆయన ఇలా అన్నారు: "ప్రజా సమస్యలపై పూర్వపు రాజులకు ఉన్న అవగాహన, దూర దృష్టి నేటి పాలకుల్లో లేకపోయింది. నిజాం పాలకులు, శ్రీకృష్ణ దేవరాయల వంటి రాజులు అరకొర సాంకేతిక పరిజ్ఞానంతోనే అద్భుతమైన రీతిలో నీటి సరఫరా చేశారు. కాని నేటి మన పరిపాలకులు వేల కోట్ల రూపాయలు వెచ్చించి కూడా జల సంపదను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు". డా. జయప్రకాష్ నారాయణ్ గారి ఈ మాటలకు జోహార్లు అర్పించాల్సిందే. అలాగే కేవలం ర్యాంకులకు, మార్కులకు పెద్ద పీట వేస్తున్న నేటి విద్యా వ్యవస్థపై స్పందిస్తూ ఆయన, "ర్యాంకులు వస్తేనే సరిపోదు. విద్య అనేది మనిషిలో సంస్కారం పెంచి, మానవునిగా పరిపూర్ణతను ఇవ్వాలి" అంటూ తన నిబద్ధతను చాటారు. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించే బిల్లుపై ఆయన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ "భారత రాజ్యాంగ రక్షణ కోసం ప్రాణాలకైనా తెగించి పోరాడతానని" స్థిరంగా ప్రకటించారు.

విద్యావంతులు, రాజకీయ నిబద్ధత గల ఇలాంటివారు మరింత మంది ముందుకు వస్తే ప్రస్తుత రాజకీయ వ్యవస్థ ప్రక్షాళనం సులభతరమవుతుంది. నానాటికీ నైతికపు విలువలు దిగజారిపోతున్న తరుణంలో ప్రజలు మంచి కోసం పోరాడే వారినీ, నీతిమంతుల్ని తమ ప్రతినిధులుగా ఎన్నుకుంటే తమకు తాము మేలు చేసుకున్న వారవుతారు. ఏ నాటికైనా ప్రత్యామ్నాయ శక్తి నీతిమంతులైన నాయకులదే అన్నది 'నెలవంక' దృఢ నమ్మకం. డాక్టర్ సాబ్! మీ కృషి శ్లాఘనీయం.

# ఫీమా వారి ఇఫ్తార్ పార్టీ



ఫెడరేషన్ అఫ్ ఇండియన్ ముస్లిం అసోసియేషన్ (**FIMA**) ఆధ్వర్యంలో 8-9-09 వ తేదీన స్థానిక క్రౌన్‌ప్లాజా హోటల్‌లో జరిగిన ఇఫ్తార్ విందుకు పలు సంస్థల నాయకులు, మేధావులు, పండితులు హాజరయ్యారు. భారత ఎంబాసిడర్ శ్రీ అజయ్ మల్హోత్రా ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఫీమా ప్రెసిడెంట్ జనాబ్ ముఖ్తార్ మారూఫ్ ఆహూతులకు స్వాగతం పలికారు. మరో ముఖ్య అతిథి డా. అబ్దుల్లా అల్ ఫార్సీ ఆంగ్లంలో ఇస్లాం మూల స్థంభాలను మనోహరంగా విశదీకరించారు. అనంతరం శ్రీ అజయ్ మల్హోత్రా ఆహ్లాదకర వాతావరణంలో ప్రసంగిస్తూ భారత దేశానికి చెందిన కువైట్‌లోని వివిధ భాషా, మత వర్గాల మధ్య సఖ్యతకు తమ తరవున పూర్తి సహాయసహకారాలుంటాయని హామీ ఇచ్చారు. భారతీయుల పాస్‌పోర్టుల, తదితర అవసరాలను త్వరితగతిన తీర్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.








## తెలుగు తెలిసిన ఆంధ్ర వనితలకు శుభవార్త

కువైట్‌లోని ఐపిసి మహిళా విభాగాలలో ఇస్లామీయ, అరబీ భాషా కోర్సులు అక్టోబరు మొదటి వారం నుండి ప్రారంభమౌతున్నాయి ఇన్షాఅల్లాహ్.

1) అన్ని కోర్సులూ ఉచితంగా బోధించబడుతాయి.
2) ఈ కోర్సులలో పేర్ల నమోదు ఇప్పటికే మొదలయింది.
3) ఇస్లామీయ జ్ఞానార్జన పట్ల ఆసక్తి కలవారు లేక అరబీ భాషనభ్యసించే ఆసక్తికలవారు క్రింద ఇవ్వబడిన ఏరియా ఆఫీసులలో తమ పేర్లు నమోదు చేయగలరు.

| | | |
|---|---|---|
| ⊙ రౌదహ్ | 22512257 | 97290278 |
| ⊙ ఖైతాన్ | 24735627 | 99285459 |
| ⊙ జహ్రా | 24558830 | 97533948 |
| ⊙ సాల్మియా | 25733263 | 99847624 |
| ⊙ మంగఫ్ | 23723002 | 99256165 |
| ⊙ సల్వా | 25637900 | 94064491 |
| ⊙ షర్ఖ్ | 22418934 | 94066954 |






# తెలుగు ముస్లిం అసోసియేషన్
## ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కువైట్‌లోని తెలుగు ముస్లిం అసోసియేషన్ ఆధ్వర్యంలో 4-9-09వ తేదీన రౌదాలోని ఇస్లాహి సెంటర్ ఆడిటోరియంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయబడింది. మౌలానా తాహెర్ మదనీ గారీ అధ్యక్షతన జరిగిన ఈ సభనుద్దేశించి వివిధ ప్రాంతాల పండితులు, సంఘాల నాయకులు ప్రసంగించారు. 'మానవతకు ఖుర్ఆన్ సందేశం' అన్న అంశంపై 'నెలవంక' ఎడిటర్ శ్రీ అజీజుర్రహ్మాన్ తెలుగులో ప్రసంగించారు.


ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని టి.ఎమ్.ఎ ప్రచురణా విభాగం (అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్) తరఫున ప్రచురితమైన "ఖుర్ఆన్ మరియు సైన్సు" అనే డా. జాకిర్ నాయక్ గారి తెలుగు పుస్తకాన్ని స్థానిక భారత వాణిజ్యవేత్త ముజమ్మిల్ మలిక్ గారు ఆవిష్కరించారు. అనంతరం మౌలానా సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ (ఐ.పి.సి ప్రబోధకులు) ఈ పుస్తకంలోని ప్రధానాంశాలను విశ్లేషించి, దీన్ని తెలుగులో ప్రచురించినందుకు టి.ఎమ్.ఎ సంస్థ వారిని అభినందించారు.

300 మంది ఆహూతులు విచ్చేసిన ఈ సభ హాఫిజ్ ఖలీల్ అహ్మద్ ఖుర్ఆన్ పారాయణంతో మొదలయింది. ఈ సంస్థ కడప అధ్యక్షులు జనాబ్ షేఖ్ ఇన్‌హాఖ్ అలీ గారు కన్వీనర్‌గా వ్యవహరించగా, జనరల్ సెక్రటరీ మౌలానా అక్బర్ అలీ రషాదీ గారు నివేదికను సమర్పించారు. సంస్థ కువైట్ అధ్యక్షులు షేఖ్ రియాజ్ గారు తెలుగు పుస్తకం తొలి ప్రతులను స్థానిక మేధావులకు, ఇంజనీర్లకు అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డా. రాజశేఖర్ రెడ్డి మరణం రాష్ట్రానికి తీరని లోటని టి.ఎమ్.ఎ సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జనాబ్ ముహమ్మద్ హనీఫ్ గారు, అలుపెరగని ముఖ్యమంత్రి గారి ప్రజా సేవలను వివరించి శ్రద్ధాంజలి ఘటించారు. జనాబ్ నేమతుల్లా గారు ఆహూతులకు స్వాగతం పలకగా, జనాబ్ ఇస్హాఖ్ అలీగారు అందరికీ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.







# రండి, ఆత్మ పరిశీలన చేసుకుందాం!

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**"ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ కుటుంబీకుల్ని అగ్ని బారి నుండి కాపాడుకోండి". (తహ్రీమ్: 6)**

ఈ ఆయతులో విశ్వాసులకు అత్యంత ముఖ్యమైన వారి బాధ్యతను గుర్తు చేయడం జరిగింది. వారు నిరంతరం ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఉండాలని, పరలోక జీవితాన్ని క్షణకాలం కోసం సైతం మరువకూడదనీ గుర్తు చేయడం జరిగింది. కాబట్టి మనం మనందరి కర్మల లెక్క అల్లాహ్ తీసుకోక ముందే మన లెక్కలను మనం సరిచేసుకుందాం. అందుగ్గాను క్రింద కొన్ని ప్రశ్నలు ఇవ్వబడ్డాయి. ప్రతి ఒక్కరు ఆత్మ సాక్షిగా వీటికి సమాధానాలు చెప్పుకుని లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుంటారన్న ఆశాభావంతో ఈ శీర్షికను మీకు అందజేస్తున్నాము.

1) మన జీవితం నిజంగా దైవ దాస్య భావనతో సాగుతోందా?
అ) అవును ఆ) కాదు ఇ) కొంతవరకు

2) మనం నమాజుకు ముందే మస్జిద్‌కు వెళుతున్నామా? నఫిల్ నమాజులు చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

3) నమాజు అనంతరంగానీ, ఇతరత్రా సమయాల్లోగాని చేయవలసిన దుఆలు చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

4) మనం తహజ్జుద్ నమాజుగానీ, నఫిల్ ఉపవాసాలుగాని పాటించేందుకు ప్రయత్నించామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

5) మనం ఖుర్‌ఆన్‌ను శ్రవణానందంతో విని అర్థం చేసుకునే, ఆలోచించే ప్రయత్నం చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

6) మనం న్యాయం, ఉపకారం చేయటం, బంధుత్వాలను పటిష్ఠ పరచటం లాంటి ఉత్తమ గుణాల్ని అలవర్చుకున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

7) మనం పరోక్ష నింద, కూపీలు లాగటం, హేళన చేయడం, అనుమానించడం లాంటి దుర్లక్షణాలకు దూరంగా ఉండేందుకు కృషి చేశామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

8) మనం ప్రదర్శనాబుద్ధి, అహంకారం, లోభత్వం వంటి అవగుణాలకు దూరంగా మసలుకుంటున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

9) మోహం, మదం, మద్యపానం, జూదం లాంటి దుర్వ్యసనాలకు ఎడంగా మసలుకుంటున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

10) మనం సంపాదన విషయంలో ధర్మాధర్మాల విచక్షణను కలిగి ఉన్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) అప్పుడప్పుడు

11) మనం మన సంపదను దైవ మార్గంలో (దీన నిరుపేదలు, అనాథలు, వితంతువులు, అవసరార్థుల కోసం) ఖర్చు చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) అప్పుడప్పుడు

12) మనం ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తిని ఆదుకుంటున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) అప్పుడప్పుడు

13) మనం సత్యవంతుల సాంగత్యం కలిగి ఉండేందుకు, దుష్టుల సావాసం నుండి దూరంగా ఉండేందుకు కృషి చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

14) మనం దేవుని దాసులను ధర్మం వైపు ఆహ్వానించామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

15) మనం ఇస్లామీయ వ్యవస్థ సంస్థాపనార్థం సామూహిక కృషి చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

16) మనం చేసే ప్రతి సత్కార్యం దైవ ప్రసన్నత కోసం, పరలోక భీతితోనే చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

17) మనం పరలోక జీవితాన్ని, మృత్యువును, సమాధి యాతనను గుర్తు చేసుకుని పాపాల నుండి పశ్చాత్తాపం చెందుతున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) అప్పుడప్పుడు

18) మనం సన్మార్గభాగ్యం కోసం, రుజుమార్గంపై నిలకడ కోసం దుఆ చేస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) అప్పుడప్పుడు

19) మనం మన చూపుల్ని పర స్త్రీ (పురుషుల)పై పడకుండా జాగ్రత్త వహిస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

20) మనం ఇతరులకు చెప్పే నీతుల్ని, చూపే ఆదర్శాల్ని స్వయంగా పాటిస్తున్నామా?
అ) అవును ఆ) కాదు) ఇ) కొంత వరకు

## మార్కులు:

అవును - 5 కాదు - 0
కొంత వరకు (అప్పుడప్పుడు) - 2

పూర్తి మార్కుల సంఖ్య 90-100 వస్తే మనం ఉత్తమ స్థితిలో ఉన్నాము, అయితే గర్వానికి లోను కాకూడదు సుమా! 60-89 వరకు వస్తే మనం ఇంకా ఎదిగేందుకు ప్రయత్నించాలి. 35-59 వరకు వస్తే దాన్నే హెచ్చరికగా భావించాలి. 15-34 వరకు వస్తే దాన్ని మన హీన స్థితిగా భావించి, క్షమాభిక్షకై దైవాన్ని వేడుకోవాలి.

# అంటువ్యాధులు ఎందుకొస్తాయి...?

- ఇబ్నె అలీ

మానవుడు ఎన్నో సాధిస్తున్నాడు. ఛేదిస్తున్నాడు. మరెన్నో నూతన ఆవిష్కరణలు చేపడుతున్నాడు. నేటి సాంకేతిక పరిజ్ఞానమే దానికి సాక్షి. మరోవైపు కొన్ని సందర్భాల్లో మానవునికి పరాజయమూ తప్పడం లేదు. చిన్న చిన్న జీవులు (వైరస్‌లు) సైతం మానవుడిని గడగడలాడిస్తున్నాయి. బెంబేలు పెట్టిస్తున్నాయి. గుండె దడ పెంచుతున్నాయి. దమ్ముంటే కాచుకోండి అని పెను సవాలు విసురుతున్నాయి. ఇందుకు మొన్నటి 'సార్స్', నిన్నటి 'బర్డ్‌ఫ్లూ' , నేటి 'స్వైన్‌ఫ్లూ' లే ప్రత్యక్ష నిదర్శనం. జీవానికి – నిర్జీవానికీ మధ్య తారాడే ఈ వైరస్‌లు పక్షులు, జంతువులు, మనుషులను ఆలంబనగా చేసుకొని తరచూ జన్యురూపాలు మార్చుకుంటూ ఎప్పటికప్పుడు ప్రపంచ మానవాళి ఉనికిని ప్రశ్నిస్తూనే ఉన్నాయి.

### స్వైన్ ఫ్లూ అంటే ...

'స్వైన్' అనేది ఆంగ్ల పదం. దీనర్థం పంది. సాధారణంగా పందులకు ఈ వ్యాధి వస్తుంటుంది. అందుకే దీనిని స్వైన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ (ఎస్.ఐ.వి) అంటారు. స్వైన్ ఫ్లూ వైరస్‌ను 'హెచ్1 ఎన్1' అని పిలుస్తారు. 1930లో మొదటిసారి ఈ వైరస్‌ను కనుగొన్నారు. పందులు, పక్షులు, మనుషులకు చెందిన మూడు రకాల వైరస్‌లు కలిసి ఈ స్వైన్ వైరస్ ఏర్పడుతుంది. మధ్య పశ్చిమ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికో, కెనడా, సౌత్ అమెరికా, యుకె, స్వీడన్, ఇటలీ, కెన్యా, చైనా జపాన్ దేశాల్లోని పందులకు ఇది వ్యాపిస్తుంటుంది.

### ఎలా వ్యాపిస్తుంది?

ఇది కేవలం నోటి ద్వారా వచ్చే తుంపరల ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధిగ్రస్తులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళినప్పుడు వారి దగ్గు లేదా నోటి తుంపరలు, శ్లేష్మం మొదలైన వాటివల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. పందుల వద్ద పనిచేసేవారికి ఇది వ్యాపించే అవకాశాలు ఎక్కువ.

స్వైన్ ఫ్లూ ప్రభావిత వస్తువులను తాకిన చేతులను నోట్లో, ముక్కులో పెట్టుకోవడం ద్వారా ఇతరులకు సోకుతుంది.

### వ్యాధి లక్షణాలు

(1) జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఛాతినొప్పి ఎక్కువగా ఉంటాయి.

(2) ఊపిరితిత్తుల్లో విపరీతమైన బాధ ఉంటుంది.

(3) విపరీతమైన వాంతులవుతాయి.

(4) తుమ్మిన, దగ్గిన సమయాల్లో ఎదుటి వారికి వెంటనే సోకుతుంది.

### నివారణా మార్గాలు

(1) ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

(2) చేతులు ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.

(3) జంతువుల వద్ద పనిచేస్తున్న వ్యక్తులు చేతులకు గ్లోవ్స్ వేసుకోవాలి.

(4) మాస్కులు ధరించి ఉండాలి.

(5) అన్నింటికంటే ముఖ్యంగా ఇలాంటి రోగాల నుండి అల్లాహ్ శరణు వేడుకోవాలి. దుఆలు చేస్తూ ఉండాలి.

### అంటు వ్యాధులకు కారణం

వ్యాధులు సోకడం కొత్తేమీ కాదు. అడపాదడపా అంటువ్యాధులు విజృంభించి మానవులకు ముప్పుతిప్పలు పెడుతుంటాయి. గతంలో కూడా కొత్తకొత్త వ్యాధులు సోకాయి. వేలాది ప్రాణాలను హరించాయి. అయితే ఈ అంటువ్యాధులు ఎందుకు వ్యాపిస్తుంటాయి. సైన్స్ పరంగా చూస్తే ... వైరస్‌లే వ్యాధులకు కారణాలు అని తెలుస్తుంది. మనం ఆలోచించాల్సిన మరో విషయం ఏమిటంటే కేవలం వైరస్‌లే వీటికి కారణమా? లేదా దైవధిక్కారం, దైవానికి అవిధేయత చూపడం వల్లనా?

ప్రకృతి వైపరీత్యాలను కేవలం భౌతిక దృష్టితోనే చూడరాదంటోంది ఇస్లాం. ఆ మాటకొస్తే ప్రపంచంలో ఏ విషయాన్నీ కేవలం భౌతిక దృష్టితో చూడరాదు. భౌతికవాదం మనిషిని మర మనిషిగా తయారు చేస్తుంది. సంఘటనల వెనుక పరమార్థాలను కాస్త ఆధ్యాత్మిక దృష్టితో కూడా ఆలోచిస్తే మానవ జీవితం మీద దాని ప్రభావం అత్యంత లాభదాయకంగా ఉంటుందన్నది ఇస్లాం వాదన. ఇది కేవలం ఊహాసంబంధ వాదన మాత్రమే కాదు. నిజ జీవితంలోనూ దానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వస్తుంటాయి. ఉదాహరణకు ఒక హదీసులో మహాప్రవక్త (స) ఇలా ప్రబోధించి ఉన్నారు: ఆ హదీసు భావార్థం ఇది:

ఏ సమాజంలోనయితే వడ్డీ వ్యాపారాలు మహా జోరుగా సాగుతాయో ఆ సమాజంలో కరువు కాటకాలు సంభవిస్తాయి. ఏ సమాజంలోనయితే అశ్లీలం రాజ్యమేలుతుందో, వ్యభిచార కార్యక్రమాలు పెచ్చరిల్లుతాయో ఆ సమాజంలో అప్పటి వరకు కనీ వినీ ఎరుగని కొత్త కొత్త రోగాలు ప్రబలుతాయి.

అల్లాహ్ సూరె రూమ్‌లో ఇలా సెలవిస్తున్నాడు: **"మానవులు చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగానే నేలపైనా, నీటిలోనూ కల్లోలం చెలరేగింది; వారి కొన్ని చేష్టల (ఫలితం) ను వారికి చవిచూపడానికి; బహుశా వారు తమను సంస్కరించుకుంటారేమో అని"**. మానవులపై పడుతున్న ఉపద్రవాలు, కొత్త కొత్త రోగాలు అన్నీ మనం చేసుకుంటున్న స్వయంకృతాలే అని ఈ సూక్తి ద్వారా స్పష్టం అవుతుంది. సునామీ, ఎయిడ్స్, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ ఇవన్నీ కొత్త ఉపద్రవాలు, వ్యాధులు. వీటి పేర్లు మనం మునుపెన్నడూ వినలేదు. కొత్తకొత్త ఉపద్రవాలు, రోగాల రూపంలో అవి మనపై విజృంభిస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితుల్లో భౌతిక పరంగా ఆ ప్రకృతి వైపరీత్యాలకు నివారణామార్గాలు కనుగొనడంతోపాటు మనిషి మీద ఇంకో బాధ్యత కూడా ఉంది. అదే ఆత్మపరిశీలన. తాము చేసిన ఏ పాపాలకు దేవుడు తమకు ఆ బాధలకు గురిచేస్తున్నాడో మనిషి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అలాంటి వాటి నుండి దూరంగా ఉండాలి. లేదంటే అల్లాహ్ ఆగ్రహానికి గురికాక తప్పదు. ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ కూడా అల్లాహ్ ఆగ్రహానికి ప్రతిరూపమేమో..? జాగ్రత్త పడండి. తప్పులను తెలుసుకోండి. అల్లాహ్ ముందు సాష్టాంగపడండి. అల్లాహ్ అనుగ్రహాన్ని పొందండి.

('గీటురాయి' వార పత్రిక (15.5.09) సౌజన్యంతో)

# నెలవంక ఉత్తరాలు

## 'నిజ ప్రభువును కనుగొన్నాను'

అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు. నా ముందు పేరు సాతూరి బేబి రత్న కుమారి. ముస్లింనయ్యాక పేరు ఫాతిమా, మా ఊరు ప. గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని 'పిప్పర'.

బ్రతుకు తెరువు కోసం ఈ దేశం వచ్చిన నాకు ఎన్ని రోజులు నెలలు సంవత్సరాలు గడిచినా, ఎంత కష్టపడి సంపాదించినా డబ్బు యొక్క అవసరాలు తీరక మరిన్ని అవసరాలు పెరుగుతూ జీవితంలో తృప్తి కనబడక కష్టాలే కనబడసాగాయి. జీవిత గమ్యమేమిటో తెలియని సమయంలో నిజమైన గమ్యం దొరికింది. అల్లాహ్ దయ వలన నన్ను సృష్టించిన ప్రభువు మరియు ఈ భూమ్యాకాశాల సృష్టికర్త ఎవరో తెలుసుకోవడం జరిగింది. ఆయన గురించి తెలుసుకున్నాను. కనుల ముందున్న మాయా పొరలు తొలగించుకొని నా ప్రభువుకు నా మనస్సును అర్పణ చేసి ఖురాను, హదీసుల వెలుగులో నా జీవితాన్ని గడుపుతూ ఉంటే ఇప్పుడు కష్టాలు కూడా సుఖాలుగానే కనిపిస్తున్నాయి అల్‌హందులిల్లాహ్.

ఇంతలో అచ్చమైన తెలుగు భాషలో స్పష్టంగా తెలుగు ఎంతో మధురాతి మధురముగా వ్రాసే రచయితలచే ఐపిసి ప్రచురింపజేసి నటువంటి నెలవంక మాస పత్రికను మాకు అందేలా చేశాడు అల్లాహ్. నిజంగానే సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక పత్రిక ఈ నెలవంక. ఆగస్టు నెలకు సంబంధించి వ్రాస్తున్నాను - అహంకారంతో విర్ర వీగి దేవుని తిరస్కరించిన వారి గాథలు, ముహమ్మద్ (స) వారి జీవితపు సందేశాత్మక విషయాలు, సహాబీల విషయాలు నేటి కాలానుగుణమైన మార్పులు, పరిశుభ్రతలు విచ్చలవిడిగా మార్గభ్రష్టత్వానికి గురి అవుతున్న నేటి నవ తరానికి గుణపాఠం చెప్పే హెచ్చరికలు, కామ మైకంలో పడి విలువైన జీవితాలను బలి చేసుకుంటున్న అభాగ్య జీవితాలు గురించి - ఇలా ఎన్నెన్నో చక్కని విషయాలతో ఖురాను, హదీసు వెలుగులో మీరు మాకు అందిస్తున్న సమాచారాన్ని చదివి చిరునవ్వుతో మా ముఖాలు వికశించాయి.

ఐపిసి కార్యాలయంలో పని చేసే ఇలాంటి గొప్ప సమాచారాలను అందజేస్తున్న నెలవంక సంపాదక వర్గానికి, ఇంకా దైవ మార్గంలో కృషి చేస్తున్న సోదరులందరికీ అల్లాహ్ కరుణ, సహాయము ఇహపరాల్లో లభించుగాక, ఆమీన్. ఇంకా మరెన్నో సృజనాత్మకమయిన సందేశాలను అందించాలని మా కోరిక!

ఇట్లు
దైవ విధేయురాలు - యస్. ఫాతిమా (హదియా)

## స్పందన

అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు.

జులై సంచికలో ప్రచురణ అయిన **'కల చెదిరింది... కథ మారింది'** అనే ఆర్టికల్ చాలా బాగుంది. అది ప్రతి మనిషి జీవితానికి ఒక పాఠం వంటిది. ముఖ్యంగా మన ప్రవాసాంధ్రులకు చాలా ముఖ్యమైనది. దీన్ని చదివిన ప్రతి ఒక్కరూ ఇకనైనా సరియైన మార్గంలో నడవాలని మనసారా కోరుకుంటున్నాను.

ప్రతి మనిషి తాను మంచి చేసినా లేక చెడు చేసినా దాని ఫలితాన్ని ప్రత్యేకంగా చూసే రోజు రాబోతుంది అని మనిషి తెలుసుకోవడం లేదు. అంతేకాదు తాను చేసే పని అయిపోవాలి - అది మంచి అయినా, చెడు అయినా. తర్వాత దాని ఫలితం ఏమిటి అనే ఆలోచన లేదు. ఆలోచించేలోపే జీవితం పతనంలో పడిపోతుంది.

తనను నమ్ముకొన్నవారి పరిస్థితి ఏమిటి? తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు. పెళ్ళి అయితే భార్య వారి కుటుంబ పరిస్థితి ఏమిటి అని బాధపడతాడు.

అప్పుడు అతని కళ్ళు తెరుచుకుంటాయి. జ్ఞానం వస్తుంది. **'తనకు ఈ రోజు ఇంకా ఎంతో దూరంగా ఉంటే ఎంత బాగుండేది!' అని మనిషి ఆ రోజున కోరుకుంటాడు. (ఆలి ఇమ్రాన్: 30)**

ఇటువంటి సమస్య నాకూ ఎదురైంది. అయితే నేను దానికి లొంగ లేదు. కారణం: నాలో భయం, దేవుని భయం రెండూ నన్ను రక్షించాయి. నాకు తెలియకుండా ఒక అమ్మాయి దగ్గరకు నా ఫోన్ నెంబరు వెళ్ళింది. అది ఎలా అనేది నాకు తెలియదు. ఆమె మాటలు ముత్యాలు, నవ్వులు కురిపించే మాటలు. అంతే, ఒకసారి ఆమె తన ఉద్దేశాన్ని చెప్పేసింది - నీవే నా సర్వస్వం. నీవు లేకపోతే ఏమీ లేదు. భోజనం చేస్తున్నా, తినే గిన్నెలో నీ రూపమే. నిద్ర పట్టడం లేదు... ఒకసారి నాకు భయం వేసింది. ఇది ఎంతవరకు నిజం అనేది తెలియదు. నేను తొందరపడలేదు. నా వల్ల ఇతరులు ఇబ్బందులు పడకూడదు. వారికి నష్టం జరగకూడదు అనే ఆలోచనతో నాకు ధైర్యం కలిగింది. నన్ను నేను నియంత్రించుకున్నాను. అది కేవలం ఆకర్షణ మాత్రమే అని తెలుసుకొన్నాను. దాని మార్గం నరకం. జీవితం పతనం అని గ్రహించాను. అల్లాహ్ మార్గంలో ఉంటూ ఆయన ఇచ్చే సకల ఐశ్వర్యాలను, సుఖ సంతోషాలను వదిలి వ్యర్థమైన మార్గభ్రష్టత్వంలోనికి వెళ్ళకూడదు అని నిర్ణయించుకున్నాను.

మార్గభ్రష్టత్వంలో మరణిస్తే నరకం తప్ప ఏమీ లేదు అనే సత్యం గుర్తుకు రావాలి. అల్లాహ్ అడుగడుగునా నీ మొర ఆలకిస్తాడు. క్షమించమని అర్థించు. ఆయన క్షమిస్తాడు. అపార కృపాశీలుడు అనంత కరుణామయుడు. అధికంగా క్షమించేవాడు. అక్కరలు తీర్చేవాడు. నీవు ఏమి చేస్తున్నావో అన్నీ ఆయనకు తెలుసు! పశ్చాత్తాపంతో, కన్నీటితో ఆయనను అడుగు - ఖచ్చితంగా కరుణిస్తాడు.

**"తాను సంపాదించిన పుణ్యానికి సత్ఫలితాన్నీ, తాను కూడబెట్టిన పాపానికి దుష్ఫలితాన్ని ప్రతి వ్యక్తి అనుభవిస్తాడు".** (అల్ బఖర: 286)

- అబ్దుర్రహీమ్ (మంగఫ్)

# వివేచన

"ఒకవేళ మీరు అల్లాహ్  నుండి
స్వర్గాన్నే గనక కోరుకోవాలంటే,
'ఫిర్‌దౌస్‌'నే కోరుకోండి. నిశ్చయంగా అది
మధ్యస్థ స్వర్గం  అత్యున్నత స్వర్గం కూడా
(స్వర్గానికి శిఖరం వంటిదీనూ). దానిపైనే
కరుణామయుని సింహాసనం (అర్ష్) ఉంది.
అక్కడి నుండే స్వర్గపు సెలయేర్లు పుట్టి
ప్రవహిస్తాయి". (బుఖారీ)

జన్నతుల్ ఫిర్‌దౌసిల్ ఆలా – అదో మహోన్నత స్వర్గ శిఖరం. దాన్ని చేరుకోవాలనుకున్నవారు దైవానికి మిక్కిలి ఇష్టులై ఉండాలి. విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టులై ఉండటం అసాధ్యం. కాబట్టి మనసుని కల్మషం లేకుండా ప్రక్షాళించుకుని, నిర్మలమైన బుద్ధితో చేసిన తప్పుల్ని ఒప్పుకుని, పశ్చాత్తాప కన్నీటితో పావనం చేసుకుని, సత్య మార్గాన సంపూర్ణ నిశ్చయత కలిగి ప్రశాంత హృదయంతో
మనం అల్లాహ్ సన్నిధికి చేరుకోవాలి. ఇది సాధనతో కూడిన విషయం అన్నది వాస్తవం. కాని సాధ్యము కానిది  మాత్రం కాదు.



# స్వైన్ ఫ్లూ

## నుండి రక్షణ పొందటమెలా?



తుమ్ము, దగ్గు వచ్చినపుడు రుమాలుగానీ, టిష్యూ పేపరుగానీ ఉపయోగించండి.



ఉపయోగించిన పేపరును వేస్ట్ బాక్స్‌లో పడవేయండి



చేతులను ఎల్లప్పుడూ సబ్బుతో కడిగి పరిశుభ్రంగా ఉంచుకోవాలి



'ఫ్లూ' లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్ని సంప్రదించండి



మీలో ఈ వ్యాధి లక్షణాలు ఉండి జనులను కలుసుకున్నప్పుడు కనీసం ఒక మీటరు దూరంగా ఉండండి



వ్యాధి నిర్ధారణ అయిన మీదట ఇంటి పట్టునే ఉండండి. ముఖ్యంగా స్కూళ్ళకు, జనసందోహంలోనికి వెళ్ళకండి



ఇతరులతో కరచాలనం చేయటంగానీ, ఆలింగనం చేసుకోవటం గానీ చేయకండి



చేతులు శుభ్రంగా కడిగే వరకూ ముక్కు, మొహం ముట్టుకోకండి